శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు
వార్త



## జిల్లా కలెక్టర్ ఒ.ఆనంద్‌చే వార్త 2025 నూతన సంవత్సర డైరీ ఆవిష్కరణ

**అట్టహాసంగా వార్త 2025 నూతన సంవత్సర డైరీ ఆవిష్కరణ**
**వార్త డైరీ ఆవిష్కరణలో పాల్గొన్న డిడి సదారావు**
**వార్త డైరీ ఆవిష్కరించడం చాలా సంతోషకరం జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్**



**నెల్లూరు, జనవరి 7, ప్రభాతవార్త –కలెక్టరేట్** మంగళవారం నెల్లూరు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ ఓ ఆనంద్ చేతుల మీదుగా వార్త జాతీయ దినపత్రిక 2025 నూతన సంవత్సర డైరీని అట్టహాసంగా ఆవిష్కరించడం జరిగింది. జిల్లాలోని ప్రింట్ మీడియాకు సంబంధించి నూతన సంవత్సర వార్త డైరి, తమ చేతుల మీదగా ఆవిష్కరించడం చాలా సంతోషకరమని కలెక్టర్ ఆనంద్ పేర్కొన్నారు. ఈ ఆవిష్కరణ కార్యక్రమంలో జిల్లా సమాచార శాఖ అధికారి డిడి సదారావు పాల్గొని ఆవిష్కరణ విజయవంతం చేయడం జరిగింది. ఈ ఆవిష్కరణ కార్యక్రమానికి వార్త సిటీ రిపోర్టర్ అందరూ వచ్చి దిగ్విజయంగా జరుపుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ బాలసుబ్రమణ్యం, యాడ్స్ ఇంచార్జ్ మస్తాన్, స్టాఫ్ రిపోర్టర్ నరేంద్ర, కలెక్టరేట్ రిపోర్టర్ రిజ్వాన్, ఫోటోగ్రాఫర్ మాల్యాద్రి, రూరల్ రిపోర్టర్ హరీష్, క్రైమ్ రిపోర్టర్ చక్రి, డెస్క్ ఇంచార్జ్ సతీష్, డెస్క్ సిబ్బంది పణికుమార్, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## చీఫ్ సెక్రటరీని సన్మానించిన దినేష్‌రెడ్డి



**కోవూరు, జనవరి 7 ప్రభాతవార్త :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్‌ను మంగళవారం ఆయన కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్విరాన్‌మెంట్ మేనేజ్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పోలంరెడ్డి దినేష్‌రెడ్డి కలిసి శాలువా పుష్పగుచ్ఛంతో ప్రత్యేకంగా అభినందిం చారు. ఈ సందర్భంగా తన శాఖకు సంబంధిం చిన పలు విషయాలను చీఫ్ సెక్రటరీ ద్వారా తెలుసుకున్నారు.

## కాకాణిని కలిసిన కోవూరు నేతలు



**కోవూరు, జనవరి 7 ప్రభాతవార్త** : వైసీపీ జిల్లా యాక్టివ్ కార్యదర్శిగా నియమితులైన నలుబోలు సుబ్బారెడ్డి మంగళవారం మాజీ మంత్రి, రాష్ట్ర అధికార ప్రతినిధి ప్రసన్నకుమార్‌రెడ్డి సూచనల మేరకు నెల్లూరు పార్టీ అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డిని ఆయన క్యాంపు కార్యాలయంలో మర్యాద పూ ర్వకంగా కలిశారు. బొకే అందజేసి కృతజ్ఞతలు తెలియజేశారు. ఆయన వెంట కోవూరు మండల సేవాదళ్ అధ్యక్షుడు గాజుల మల్లికార్జున రావు, పార్టీ నేతలు సీహెచ్ శ్రీనివాసులురెడ్డి, జానా గౌడ్, సతీష్, వినోద్‌కుమార్, భాస్కర్, మాల్యాద్రి, మోహన్, తదితరులు ఉన్నారు.

## పారిశుద్ధ్య కార్మికురాలు జయమ్మకు రాష్ట్రపతి ఆహ్వానం



**నెల్లూరు కార్పొరేషన్, జనవరి 7, ప్రభాతవార్త:** నెల్లూరు నగరపాలక సంస్థ భూగర్భ డ్రైనేజీ పారిశుద్ధ్య కార్మికురాలు వనపర్తి. జయమ్మకు అరుదైన గౌరవం లభించింది. ఈనెల 26వ తేదీన గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని ఢిల్లీలోని రాష్ట్రపతి కార్యాలయంవేడుకలలో పాల్గొనా ల్సిందిగా ఆహ్వాన పత్రిక ఆమె అందుకున్నారు. ఆహ్వాన పత్రాన్ని నగరపాలక సంస్థ కమిషనర్ సూర్య తేజ చేతుల మీదుగా ఆయన చాంబర్లో జయమ్మ మంగళవారం అందుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ భూగర్భ డ్రైనేజీ కార్మికుల కోసం కేంద్ర ప్రభుత్వం రూపొందించిన ఎన్.ఎస్.కె.ఎఫ్.డి.సి. పథకం లబ్ధిదారునిగా జయమ్మ సెప్టిక్ ట్యాంక్ వాహనానికి యజమానిగా ఉంటూ, స్వయంకృషితో విధులు నిర్వహించడాన్ని, సాటి పారిశుద్ధ్య కార్మికులకు ఆదర్శంగా నిలవటాన్ని గుర్తించిన కేంద్ర ప్రభుత్వం ఈ గౌరవాన్ని కల్పించిందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ ఆలోచనలతో దేశవ్యాప్తంగా అన్ని కార్పొరేషన్లలో గత మూడేళ్లుగా భూగర్భ డ్రైనేజీ పనులను మానవ రహితంగా, వాహనాల ద్వారా నిర్వహిస్తూ, పారిశుద్ధ్య కార్మికులను ఆయా వాహనాలకు యజమానులుగా అవకాశాన్ని కల్పించడం మంచి ఫలితాలను రాబట్టిందని కమిషనర్ వెల్లడించారు. గౌరవ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈనెల 26 వ తేదీనగణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్రపతి భవన్ లో అందించనున్న విందులో పాల్గొనే గొప్ప అవకాశాన్ని నెల్లూరు నగరపాలక సంస్థ కార్మికురాలు జయమ్మ సాధించడం అందరికీ ఆదర్శనీయమని కమిషనర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు నగరపాలక సంస్థ ఇంజనీరింగ్ విభాగం ఎస్.ఈ రామ్ మోహన్ రావు ,తదితరులు పాల్గొన్నారు.

## ముత్తుకూరులో అన్న క్యాంటీన్



**ముత్తుకూరు, జనవరి 7, ప్రభాతవార్త** ముత్తుకూరులోని బస్టాండ్ సెంటరులో క్యాంటీన్ ఏర్పాటుకు సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి స్థల పరిశీలన చేసారు. శిథిలావస్థలో ఉన్న ఆర్ అండ్ బీ అతిథి గృహానికి అదానీ కృష్ణపట్నం పోర్టు సీఎస్ఆర్ నిధులతో పూర్వవైభవం తెచ్చేందుకు కృషి చేస్తానని సోమిరెడ్డి ప్రకటించారు. తహసీల్దార్ కార్యాలయం వెనుక ప్రాంతంలో కృష్ణపట్నం శ్రీ సిద్ధేశ్వర, శ్రీ వేణుగోపాల స్వామి దేవస్థానాల నిధులతో కళ్యాణ మండపం నిర్మాణానికి స్థల పరిశీలన చేసారు

## అభివృద్ధి, సంక్షేమాలే టీడీపీ అజెండా



**కోవూరు, జనవరి 7 ప్రభాతవార్త :** ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అభివృద్ధి , సంక్షేమం దిశగా ముందుకు సాగుతుందని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి పేర్కొన్నారు. కోవూరు మండలం పోతిరెడ్డిపాలెం పంచాయతీ పరిధిలోని సాలుచింతల సెంటర్ మసీదు వీధిలో ఎన్ఆర్ఈజీఎస్ నిధులు 8.50 లక్షల వ్యయంతో నిర్మాణం చేపట్టనున్న సిమెంట్ రోడ్డుకు మంగళవారం ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజా సంక్షేమమే లక్ష్యంగా వినూత్న పథకాలకు శ్రీకారం చుడుతున్న ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కు ఈ సందర్భంగా ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారు. అభివృద్ధి కార్యక్రమాలకు ఆటంకం లేకుండా సంక్షేమ పథకాలు అమలు చేసే సామర్థ్యం చంద్రబాబుకే ఉందన్నారు. అప్పుల భారంతో అస్తవ్యస్తమైన రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని ఇప్పుడిప్పుడే ఆయన గాడిన పెడుతున్నారన్నారు. గత ఐదేళ్లలో తట్టెడు మట్టి కూడా నోచుకోని గుంతల రోడ్లు, సంక్రాంతి నాటికి నూతన రూపు వస్తుందన్నారు. 12.50 కోట్ల వ్యయంతో కోవూరు నియోజకవర్గ వ్యాప్తంగా చేపట్టే అభివృద్ధి పనుల నిర్మాణ కార్యకలాపాల్లో టీడీపీ నాయకులు కార్యకర్తలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. గ్రామాల్లో జరిగే అభివృద్ధి పనులను పార్టీ క్యాడర్ పర్యవేక్షిస్తూ మీ గ్రామాలను అభివృద్ధి చేసుకునే బాధ్యత మీదే అన్నారు. చేపట్టే అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరి అన్నారు. నెల్లూరు జిల్లాకు భారత పెట్రోలియం కార్పొరేషన్ రిఫైనరీ రాకతో వేల సంఖ్యలో యువతకు ఉపాధి దొరుకుతుందన్నారు. ఇటువంటి భారీ పరిశ్రమ నెల్లూరు జిల్లాకు వచ్చేందుకు సహకరించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌కు, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు. అనంతరం ఆమె మసీదు వీధి ప్రాంతంలో ఉన్న ప్రజలతో మాట్లాడి పలు సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అసంపూర్తిగా ఉన్న మసీదును కూడా ఆమె పరిశీలన చేపట్టారు. ఈ కార్యక్రమంలో పెన్నా డెల్టా ఆయకట్టు చైర్మన్ జెట్టి రాజగోపాల్‌రెడ్డి, ఎంపీపీ టి. పార్వతి, జిల్లా తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు రెడ్డి, గ్రామ దత్తత నాయకుడు తిరుమూరు అశోక్‌రెడ్డి, పార్టీ నేతలు కోవూరు నీటి సంఘం అధ్యక్షుడు అత్తిపల్లి శివప్రసాద్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు నాగరాజు, సునీల్‌కుమార్‌రెడ్డి, ఆదిశేషారెడ్డి, నాగరాజు, గుత్తికొండ వెంకయ్య, గాదిరాజు అశోక్‌కుమార్, మస్తాన్, సీహెచ్ పెంచలయ్య, ఎస్కే మస్తాన్, జమీర్, మసూద్, జహంగీర్, పంచాయతీ రాజ్ డీఈ మోహన్‌రావు, ఏఈ పరమేశ్వరలింగం, తహసీల్దార్ నిర్మలానందబాబా, ఎంపీడీవో శ్రీహరిరెడ్డి, కోవూరు సీఐ సుధాకర్‌రెడ్డి ఎస్సై రంగనాథ్‌గౌడ్ ఏపీఎం సుబ్బరాజు, జనసేన నాయకులు సీహెచ్ శ్రీనివాసులురెడ్డి, మున్వర్ బాషా, అల్తాఫ్, బీజేపీ నాయకులు సుబ్బారావు, తదితరులు ఉన్నారు.

## సోమశిల నీటిమట్టం



**అనంతసాగరం, జనవరి7 ప్రభాతవార్త:** మండలంలోని సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి మంగళవారం సాయంత్రానికి 2630 క్యూసెక్కుల వంతున వరద ప్రవాహం నమోదైంది. జలాశయం పూర్తిసామర్థ్యం 78 టిఎంసిలు కాగా ప్రస్తుతం జలాశయం లో 71.489 టిఎంసిల నీరు నిల్వ ఉంది. ఎస్ఎఫ్‌సికి 350, ఎన్ఎఫ్‌సికి 600, పెన్నా డెల్టాకు 2050, కండలేరు వరద కాలువకు200 క్యూసెక్కులు వంతున నీటిని విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం 99.690 మీటర్ల మేర నీటిమట్టం నమోదైందని జలాశయం అధికారులు తెలిపారు.

## జిల్లాలో కోడిపందాలు నిర్వహిస్తే చర్యలు తప్పవు



**నెల్లూరు, జనవరి 7, ప్రభాతవార్త –కలెక్టరేట్** సంక్రాంతి పండుగ నేపథ్యంలో జిల్లాలో ఎక్కడా కూడా కోడిపందాలు నిర్వహించకుండా తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆనంద్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఉదయం కలెక్టరు వారి చాంబర్‌లో పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో జంతుహింస నివారణ చట్టం అమలుపై ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సంక్రాంతి పండుగకు గ్రామాల్లో కోడిపందాలు నిర్వహించడం నేరమన్నారు. కోడిపందాలు జరగకుండా గ్రామాల్లో అవగాహన కల్పించాలన్నారు. గ్రామ, మండల, డివిజన్, జిల్లాస్థాయిలో ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేసి కోడిపందాలు నిర్వహించకుండా చూడాలన్నారు. ఈ కమిటీల్లో పోలీసు, రెవెన్యూ, పంచాయతీ అధికారులు సభ్యులుగా వుండి గ్రామాల్లో కోడిపందాలు, ఇతర ఘర్షణ వాతావరణం లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. నిబంధనలను అతిక్రమించిన వారిపై కేసులు నమోదు చేయాలని పోలీసులకు సూచించారు. ఈ సమావేశంలో పశుసంవర్ధకశాఖ జాయింట్ డైరెక్టర్ రమేష్ నాయక్, ఏఎస్పీ సౌజన్య, డిఎఫ్ఓ మహబూబ్‌బాషా, జడ్పీ సీఈవో విద్యారమ, డిపివో శ్రీధర్‌రెడ్డి, ఏడి మాధవీలత తదితరులు పాల్గొన్నారు.

## రెడ్‌క్రాస్ చైర్మన్ పదవికి ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి రాజీనామా

- మంత్రి నారాయణ చర్యలతో రెడ్‌క్రాస్ ప్రతిష్టకు మచ్చ
- స్వలాభం కోసమే మంత్రి నారాయణ తీవ్ర ఒత్తిడి చేస్తున్నారు
- సొంత నిధులు వెచ్చించి మరీ ప్రజలకు సేవా చేశాం
- ప్రజలకు మంచి జరగాలనే స్వచ్ఛందంగా వైదొలగుతున్నా
- సమావేశంలో మంత్రి నారాయణపై ధ్వజమెత్తిన ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి



**నెల్లూరు, జనవరి7 ప్రభాతవార్త–విద్య** ప్రజలకు మంచి జరగాలనే సదుద్దేశ్యంతో నెల్లూరు జిల్లా రెడ్‌క్రాస్ పదవికి స్వచ్ఛందంగా రాజీనామా చేస్తున్నానని తూర్పు రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని స్దానిక డిఆర్ ఉత్తమ్ హోటల్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు గత నాలుగేళ్లగా రెడ్‌క్రాస్‌ద్వారా మెరుగైన సేవలను ప్రజలకు అందించటం జరిగిందన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా 13 రెడ్‌క్రాస్ ప్రాజెక్టుల ద్వారా ఉత్తమ సేవలను అందించామని, తాను రెడ్‌క్రాస్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన నాటి నుండి కమిటీల ఆధ్వర్యంలో ప్రజలకు సేవ చేసేందుకు శక్తి వంచన లేకుండా కృషిచేసామని గుర్తుచేశారు. కరోనాలాంటి విపత్కర పరిస్దితుల్లో కూడా తమ సంస్ద తరపున బాధితులకు మందులు, బోజనం,వసతి, ఆక్సిజన్ పరికరాలు, సిలిండర్లను ఉచితంగా పంపిణీచేయటం జరిగిందని, తన సొంత నిధులనుకూడా ఇందుకోసం వెచ్చించటం జరిగిందని పేర్కొన్నారు. కరోనా సమయంలో రాష్ట్రంలోనే ఉత్తమ సేవలు అందించినందుకు రెడ్‌క్రాస్‌కు అవార్డులను సైతం సాధించిపెట్టామన్నారు. తమ విద్యాసంస్దలకు చెందిన బస్సుల్లో ఆక్సిజన్ మిషన్స్‌ను ఏర్పాటుచేసి కరోనా బాధితులకు తక్షణ సమాయం కోసం అలుపెరుగని కృషిచేసామన్నారు. తలసేమియా చిన్నారులకోసం అనేక సంస్దలతో మాట్లాడి లక్షల రూపాయాల చిక్సితను వారికి అందిచంటం జరిగింది, అలాగే ఫిజికల్లీ చాలెంజడ్ పిల్లల సౌకర్యార్ధం వారికి ఉచిత బోజన, రవాణా, విద్య సౌకర్యాలను సంస్ద ఆధ్వర్యంలో సమకూర్చామన్నారు. ప్రస్తుతం రాష్ట్ర మం త్రి పొంగూరు నారాయణ రెడ్‌క్రాస్ ప్రతిష్టను దెబ్బతీసేందకు కుట్రలు పన్నుతున్నారని, మంత్రికి చెందిన నారాయన వైద్యశాలల్లో క్యాన్సర్ చికిత్స ప్రారంబించేందుకు మరో ఏడాది వరకు ఆరోగ్యశ్రీ అనుమతులు రావని, అందుకే రెడ్‌క్రాస్‌ద్వారా ఒప్పందం కుదుర్చుకుని క్యాన్సర్ చికిత్సను అందిస్తున్నట్లు చూపించి ఆరోగ్యశ్రీ కోసం నారాయణ వైద్యశాల సిబ్బంది సిద్దపడ్డారని ఆరోపించారు. తాను చైర్మన్‌గా ఉన్నన్ని రోజులు వారి ఆటలు సాగవని తనను తొలగించేందుకు హుటాహుటిన రాష్ట్ర కమిటీనుండి చెల్లని లేఖలను తీసుకురావటం జరిగిందన్నారు. వారు తీసుకువచ్చిన ఉత్తర్వులు రెడ్‌క్రాస్‌లో చెల్లవన్నారు. ఈ సంఘటనలపై జిల్లా కలెక్టర్‌ను కలిసి నివేదించటం జరిగిందని,తన వల్ల రెడ్‌క్రాస్‌కు, ప్రజలకు,రెడ్‌క్రాస్ ఇతర సభ్యులకు ఇబ్బంది కలుగకూడదు అనే ఉద్దేశ్యంతో తానే చైర్మన్ పదవికి రాజీనామా చేస్తునానని ప్రకటించారు. కేవలం మంత్రి నారాయణ స్వలాభం కోసం ప్రజలకు సేవ చేసే రెడ్‌క్రాస్‌పై కు ట్రలు పన్నటం సబబు కాదన్నారు. మంత్రి నారాయణ చేసే కుట్రలకు తమ వద్ద పూర్తి ఆధారాలు ఉన్నాయన్నారు. అధికారం ఎవ్వరికి, ఎప్పటికి శాశ్వతం కాదని గుర్తుపెట్టుకోవాలన్నారు. రెడ్‌క్రాస్ చైర్మన్ పదవికి మాత్రమే తాను రాజీనామా చేశానని, సభ్యునిగా మాత్రం కొనసాగనున్నానని, రెడ్‌క్రాస్ అభివృద్ధికి పాటుపడతామని స్పష్టంచేశారు.

## గిరిజన సంక్షేమమే నా ధ్యేయం

- గిరిజనుల సమస్యల పరిష్కారానికే ప్రత్యేక గ్రీవెన్స్
- సచివాలయ సిబ్బంది పనితీరు మెరుగుపరచుకోండి
- సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి





**ముత్తుకూరు, జనవరి 7, ప్రభాతవార్త** గిరిజన సంక్షేమమే నా ధ్యేయమని, సచివాలయ సిబ్బంది పనితీరు మెరుగుపరచుకోవాలని, ప్రజా సమస్యల పరిష్కారానికే గ్రీవెన్స్ నిర్వహిస్తున్నామని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని పైనాపురం పంచాయితీ చిన్న సంఘం గిరిజన కాలనీలో ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన బిడ్డలు కనీసం ఆధార్ కార్డులకు కూడా నోచుకోకపోవడం బాధాకరమన్నారు. కనీస అవసరమైన ఆధార్ కార్డులు లేక గిరిజనులు రేషన్ కార్డులతో పాటు ఇతర సంక్షేమ పథకాలు పొందలేకపోతున్నారన్నారు. టీడీపీ కూటమి ప్రభుత్వం ఏర్పడినాక తాను గిరిజనుల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి పెట్టారన్నారు. ఒక్క పైనాపురం పంచాయతీలో 70 మందికి జనన ధ్రువీకరణ పత్రాలు జారీ చేయించడంతో పాటు 80 మందికి ఆధార్ కార్డులు నమోదు చేయించాం, 17 మందికి పొజిషన్ సర్టిఫికెట్లు ఇచ్చామన్నారు. 43 మందికి అర్హత ఉన్నా ఓటు హక్కు లేదు, 35 మందికి రేషన్ కార్డులు లేవు, 18 మంది పింఛన్ పొందలేకపోతున్నారన్నారు. సమాజంలో ప్రత్యేకంగా గిరిజనులే అన్యాయానికి గురవుతుండటం దురదృష్టకరమన్నారు. 12 మంది ఉద్యోగులతో గ్రామంలోనే సచివాలయం ఉండటంతో పాటు మండల స్థాయిలో అధికారులు ఉన్నా పేదల కనీస అవసరాలు తీర్చలేకపోడం సరికాదన్నారు. గిరిజనుల అవసరాలు తీర్చలేని సచివాలయాలు ఎందుకు అని ప్రశ్నించారు. జిల్లా స్థాయిలో గిరిజనులకు ఆధార్ కార్డులు, రేషన్ కార్డులు, పింఛన్లు మంజూరు చేయడంపై ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఇటీవలే సర్వేపల్లి నియోజకవర్గ స్థాయిలో గిరిజనుల కోసం ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహించామన్నారు. ఆ గ్రీవెన్స్ కార్యక్రమంలోనే వందలాది మందికి ఆధార్ కార్డులు నమోదు చేయించామన్నారు. ఆధార్ కార్డు లేక పోతే భారత పౌరుడనే ఆధారం కూడా లేని పరిస్థితని, త్వరలోనే అందరికీ రేషన్ కార్డులు మంజూరు చేయడంతో పాటు పక్కా ఇళ్లు కట్టిస్తామన్నారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ పింఛన్లు అందజేయడంతో పాటు గిరిజన కాలనీల్లో ప్రత్యేక వసతులు కల్పిస్తామని హామీ ఇచ్చారు. గిరిజన బిడ్డలు తప్పనిసరిగా బడికి వెళ్లడంపైనా అందరూ శ్రద్ధవహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు పల్లం రెడ్డి రామ్మోహన్ రెడ్డి, బొమ్మి సురేంద్ర, స్థానిక సర్పంచ్ విజయకుమార్, స్థానిక నాయకులు అధికారులు పాల్గొన్నారు.

## వెన్నుపోటు పొడిచి చైర్మన్ అయ్యావు

- బెదిరించాల్సిన అవసరం మంత్రికి లేదు
- దౌర్జన్యం చేస్తే పాఠశాలలు నడపలేవు
- ప్రజలకు అనేక సేవలందిస్తున్న నారాయణ
- నీకు ప్రజలే స్పాట్ పెడతారు
- కాశీ మజిలీ కథలు చెప్పకు
- ప్రజలను మభ్యపెడుతున్న ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి



**నెల్లూరు,జనవరి 7, ప్రభాతవార్త – వైద్యం** చంద్రశేఖర్‌రెడ్డి గతంలో నువ్వు మనోహర్ ఫ్యానల్‌కి వెన్నుపోటు పొడిచి ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీకి చైర్మన్ అయ్యావనే విషయాన్ని గుర్తుంచుకుని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఆక్వా సంస్థ డైరక్టర్, రాష్ట్ర అధికార ప్రతినిధి ఆనం వెంకటరమణారెడ్డి హెచ్చరించారు. చింతరెడ్డిపాలెంలో ఉన్న ఆయన నివాసలంఒల వెంకటరమణారెడ్డి విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రశేఖర్‌రెడ్డి రెడ్ క్రాస్ చైర్మన్ పదవికి రాజీనామా చేస్తూ నారాయణపై కట్టుకథలు అల్లాడిన ఆరోపించారు. అవి నిజాలని నిరూపించే దమ్ము నీకుందా అని ఆనం ప్రశ్నించారు. తనను రాజీనామా చేయాలని నారాయణ గన్ పెట్టినట్లు ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి ఆరోపించడం ఆవాస్తవమన్నారు. అందులో ఎంత మాత్రం నిజం లేదని కావాలనే అబద్దాలు మాట్లాడుతున్నాడని వెంకటరమణారెడ్డి ఆరోపించారు. 2019 వరకు చంద్రశేఖర్‌రెడ్డి అసలు రెడ్ క్రాస్ మెంబర్ కూడా కాదు.. అసలు రెడ్ క్రాస్‌లో ఏం చేస్తారో కూడా ఎవరికి తెలియదన్నారు. 2019 లో మొదటి సారి మెంబర్ అయినప్పటి నుంచి ఇప్పటి వరకు ఒక్క చుక్క రక్తాన్ని దానం చేశావా అని సూటిగా ప్రశ్నించారు. రెడ్ క్రాస్ నీ ఏదో ఉద్దరించినట్లు మాట్లాడటం సరికాదని సూచించారు. చంద్రశేఖర్‌రెడ్డి గతం మర్చిపోయి మాట్లాడటం సరికాదని ఆనం హెచ్చరించారు. చంద్రశేఖర్‌రెడ్డి ఏదో పెద్ద దేశ్కినాయకుడు లాగా మాట్లాడుతున్నాడని వెంకటరమణారెడ్డి మండిపడ్డాడు. నెల్లూరులో మొదటి సారి రెడ్ క్రాస్‌ని బుస్థాపించింది రామచంద్రనాయుడు, సీవీ సుబ్రహ్మణ్యంలని ఆయన గుర్తు చేశారు. ఇప్పటి వరకు రెడ్ క్రాస్‌లో ఎప్పుడూ రాజకీయాలు లేవని, చంద్రశేఖర్‌రెడ్డి చైర్మన్ అయిన నాటి నుండే రాజకీయాలు మొదలయ్యాయి అన్నారు. చంద్రశేఖర్‌రెడ్డి రెడ్ క్రాస్ చైర్మన్ ఎలా అయ్యాడో ఆయన గుర్తు చేసుకోవాలని ఆయన హితవు పలికారు. గతంలో రెడ్ క్రాస్ ఎన్నికల్లో చంద్రశేఖర్‌రెడ్డి ప్యానల్ గెలవలేదని గుర్తు చేశారు. నారాయణ గురించి లేనిపోని ఆరోపణలు చేస్తే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. నెల్లూరు కోసం నారాయణ చేసిన మంచి కూడా చంద్రశేఖర్‌రెడ్డి ప్రజలకు చెప్పాలని ఆనం డిమాండ్ చేశారు. నారాయణ హాస్పిటల్ ద్వారా ప్రజలకు చేస్తున్న సేవ కూడా చెప్పాలన్నారు. నెల్లూరు టౌన్‌లో రెండు నెలలుగా పెద్ద నాయకుడిగా ఫీల్ అయిపోతున్నాడని ఎద్దేవ చేశారు. నీ రాజీనామాకు నారాయణకి సంబంధం ఏంటని వెంకటరమణారెడ్డి ప్రశ్నించారు. రెడ్ క్రాస్‌ని ఎంవోయూ అడగడంలో తప్పేమిటని అన్నారు .నిన్ను బెదిరించాలని అనుకుంటే ఒక్క స్కూల్ కూడా నడపలేవని వెంకటరమణారెడ్డి హెచ్చరించారు. నారాయణ ఎప్పుడూ మిమ్మల్ని ఇబ్బంది పెట్టలేదని, నారాయణను మీరు, జగన్ ఎలా ఇబ్బంది పెట్టాడో అందరికి తెలుసనన్నాడు. చంద్రశేఖర్‌రెడ్డి రాజకీయ లబ్ధి కోసమే కాశీ మజలి కథలు చెబుతూ ప్రజలను మభ్యపెడుతున్నాడని ఆయన విమర్శించాడు. చంద్రశేఖర్ లాంటి బచ్చా గాళకు స్పాట్ పెట్టాల్సిన అవసరం మాకు లేదని, నెల్లూరు ప్రజలే చంద్రశేఖర్ రెడ్డికి స్పాట్ పెడతారని ఆనం తెలియజేశాడు.

## జగన్‌ను కలిసిన కావలి మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి



**కావలి, జనవరి07 ప్రభాతవార్త** మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్‌రెడ్డిని తాడేపల్లిలో మంగళవారం వైసిపి కావలి నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పలు విషయాలపై ఇద్దరూ చర్చించుకున్నారు. ఈ సందర్భంగా జగన్‌మోహన్‌రెడ్డి కొన్ని సూచనలు చేసినట్లు ప్రతాప్‌రెడ్డి తెలిపారు. కావలి నియోజకవర్గంలో వైసిపిపార్టీ అభివృద్ధికి, కార్యకర్తల అభ్యున్నతికి పాటుపడాలని, వైసిపి కార్యకర్తలపట్ల అధికారులు, టిడిపినేతలు ఇబ్బందులుపెడితే వారిని గుర్తుంచుకోవాలని చెప్పారన్నారు. రానున్నది మళ్లీ వైసిపి ప్రభుత్వమేనని జగన్ తెలిపారన్నారు. ఎవ్వరికీ భయపడాల్సిన అవసరంలేదని చెప్పినట్లు తెలిపారు.

## రైతులు పంట భీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి




**అనంతసాగరం, జనవరి7,ప్రభాతవార్త:** రైతులు పంట భీమా పథకాన్ని సద్విని యోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయా ధికారిణి సత్యవాణి పేర్కొన్నారు. మండలం లోని మినగల్లు, రేవూరు గ్రామాల్లో వ్యవసా యా ధికారి శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళ వారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భ ంగా రేవూరులో జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమానికి జిల్లా వ్యవసాయాధికారిణి సత్యవాణి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ ఈ రబీ సీజన్‌లో వరిపంట వేసిన రైతులు పంట భీమా పథకాన్ని సద్విని యోగం చేసుకోవాలని కోరారు. వరిలో త్వరగా వెన్నుతీయడానికి గల కారణాలను , నివారణా మార్గాలను తెలిపారు. ఈసీజనల్‌లో అనంతసాగరం మండలంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ద్వారా 92 టన్నులు, రైతు సేవా కే ంద్రాల ద్వారా 620 టన్నులు యూరియా సరఫరా చేశామన్నారు. ఈకార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి శ్రీధర్‌రెడ్డి, ఎడిఎలు ఎ.నర్సోజి,శేషగిరిరావ్, శ్రీనివాసులు, ఎంపిటిసి సభ్యులు తుమ్మల లక్ష్మి, గ్రామ వ్యవసాయ సహాయకులు, పివి.సుబ్బయ్య, విఎఎలు, గ్రామ రైతులు పాల్గొన్నారు.

## రైలు పట్టాలపైన గుర్తుతెలియని మృతదేహం

**బిట్రగుంట జనవరి 7 ( ప్రభాతవార్త ) :** విజయవాడ రైల్వే డివిజన్ పరిధిలోని పడుగు పాడు దగ్గర కిలోమీటరు నెంబర్ 177/2119 పోస్టుల లా మధ్య ఎగువ లైన్ లో 65-70 సంవత్సరముల వయసు గల పురుషుని మృతదేహన్ని కనుగొన్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు. మృతుడు ఎత్తు 5'5, ఎరుపు రంగుకలిగి గ్రీన్ కలర్ ఆఫ్ హాండ్స్ చొక్కా, బ్లూ, గ్రీన్, తెలుగు రంగు గల లుంగీ, కాఫీ కలర్ మంకీ క్యాప్, బ్లూ కలర్ 2 పెట్ల మొలతాడు. మెరూన్ కలర్ ఫుల్ డ్రాయర్ ధరించి ఉన్నాడని తెలిపారు.కేసు నమోదుచేసి దర్యాప్తుచేస్తున్నట్టు రైల్వే హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్వరరావు తెలిపారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

**ఉలవపాడు, జనవరి 7, ప్రభాతవార్త :** ఉలవపాడులోని కే.రాజుపాలెం గ్రామం, సంఘం మరియు హైవే పక్కన ఉన్న దాబాలకు బుధవారం విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు విద్యుత్ ఏఈ పువ్వాడి శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ ఎక్స్ ప్రెస్ ఫీడర్ నుండి ఇండోసోల్ కంపెనీ వాళ్లకు లైన్ లాగుటకు ఉదయం 8గంటల నుండి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని వినియోగదారులు గమణించి సహకరించాలని కోరారు.

## కిశోర వికాసం.. బాలిక బంగారు భవిష్యత్తుకు పునాది



**ఉలవపాడు, జనవరి 7, ప్రభాతవార్త :** కిశోర వికాసం కార్యక్రమం బాలికల బంగారు భవిష్యత్తుకు పునాది వేస్తుందని ఉజ్వల ఆరోగ్యకరమైన సాధికారిత దిశగా ఆమె వేసే అడుగుకు సమిష్ట కృషితో చేయూత నిద్దామని చాకిచర్ల మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సింధు అన్నారు. మంగళవారం స్థానిక వెలుగు కార్యాల యంలో ఐసీడీఎస్ సీడీపీఓ టి.అరుణ అధ్యక్షతన కిశోర వికాసం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 11 నుంచి 18 ఏళ్ల బాలికలు చదువుపై దృష్టి పెట్టేలా అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలన్నారు. 18 ఏళ్ల నిండకుండా పెళ్లి చేయకూడదని చెప్పారు. 18 ఏళ్లలోపు వివాహాలు చేస్తే పోలీసు స్టేషన్‌లో గాని, ఐసీడీఎస్ అధికారులకు గాని సమాచారం అందజేయాలని సూచించారు. ప్రతి బాలిక తన పూర్తి సామర్థ్యాన్ని తెలుసుకోగలిగేలా సమగ్రాభివృద్ధి సొంతం చేసుకునేలా ఈ కార్యక్రమం ద్వారా చేయూతనివ్వనున్నట్లు వివరించారు. ఎంఈఓ వెంకటరమణయ్య మాట్లాడుతూ మహిళలు ఎదుర్కొంటున్న సమస్యల్లో వరకట్న మరణాలు, బాల్య వివాహాలు, గృహ హింస వంటివి పునరావృతం కాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకునేలా మహిళలను చైతన్యం చేయాలన్నారు. ఓఎస్‌సీ కేస్ వర్కర్ జే.సాధన మాట్లాడుతూ ఫోక్సో యాక్ట్, బాల్య వివాహాల చట్టాల గురించి, గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి తెలియజేశారు. జూనియర్ లెక్చరర్ సుభాషిణి మాట్లాడుతూ బాలికలు బాల్యం నుంచి యుక్త వయసు వరకు సమాజంలో మోసపోకుండా అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, మహిళా పోలీసులు, ఏఎన్‌ఎంలు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఒన్ స్టాఫ్ సఖి సెంటర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## క్రమ పద్ధతులు రైతులు పాటించాలి ఏవో శ్రీలక్ష్మి




**కొడవలూరు (విడవలూరు), జనవరి 7, ప్రభాతవార్త:** మండలం పెమ్మారెడ్డిపాలెం, కొత్త వంగల్లు గ్రామాలలో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని మండల వ్యవసాయ అధికారిని సిహెచ్ శ్రీలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు వరిలో సామూహిక ఎలుకల నివారణ కార్యక్రమం కింద డెమో ఏర్పాటు చేసి రైతులందరికీ కూడా ఉచితంగా బ్రోమోడైలిన్ మందును పంపిణీ చేయడం జరిగినది. ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని చెప్పండి జరిగింది. అదేవిధంగా రైతులందరూ వరిలో పొట్ట దశలో కచ్చితంగా పొటాష్ ఎరువు ఎకరానికి 15 నుంచి 20 కేజీలు వాడుకోవాలి అలా వాడినట్లయితే మంచి దిగుబడి రావడం జరుగుతుంది. పొటాష్ ఎరువు వాడుకోవడం వలన గింజ గట్టిపడడమే కాకుండా మంచి నాణ్యమైన గింజలు ఏర్పడతాయని తెలియజేయడం జరిగినది. ప్రతి ఒక్క రైతు కచ్చితంగా పంట నమోదు చేయించుకోవాలని తద్వారా ధాన్యం కొనుగోలు కేంద్రాలలో అమ్ముకోవడానికి వీలవుతుందని ఆమె తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ వెంకట్రావు, బిఏఏ జి మౌర్య, సిహెచ్ వంశీకృష్ణ, రైతులు కోడూరు విజయ కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కిషోర్ బాలికలకు అవగాహన



**విడవలూరు, జనవరి 7, ప్రభాతవార్త :** స్థానిక కిషోర్ బాలికలపై ఎంపీడీవో నగేష్ కుమార్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం మంగళారం ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కిషోర్ బాలికలు అంగన్వాడి కేంద్రాలను అనుసరిస్తూ క్రమ పద్ధతిలో పాటించాలని తెలియజేశారు. పౌష్టికఆహారం అంగనవాడి కేంద్రాలకు వచ్చే సరుకులను పొందాలని తద్వారా ఆరోగ్యంగా ఉంటారు. మంచి భవిష్యత్ కూడా లభిస్తుందని ఆమె తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక తాసిల్దార్ చంద్రశేఖర్, ఎంఈఓ నగేష్ కుమారి, ఏపిఎం వెంకమ్మ, తదితరులు పాల్గొన్నారు.

## మండల సమావేశం వాయిదా




**వింజమూరు, జనవరి7, ప్రభాతవార్త:** వింజమూరు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం మంగళ వారం కోరం లేక వాయిదావేసినట్లు ఎంపిడిఓ శ్రీని వాసులురెడ్డి తెలిపారు. మంగళవారం ఉదయం ఎంపిపి ఇనగనూరి మోహన్‌రెడ్డి, జడ్పీటిసి సభ్యు లు గణపం బాలకృష్ణారెడ్డి, అధికారులు హాజర య్యారు. ఎంపిటిసి సభ్యులు గైర్హాజరు కావడంతో సమావేశాన్ని 12.30గంటల వరకు వేచి ఉండి సభ్యులు రాకపోవడంతో ఎంపిడిఓ సమావేశాన్ని వాయిదా వేసి మళ్ళీ సమావేశం తేదీని తెలియజేస్తామన్నారు. ఈకార్యక్రమంలో అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## రైలు ఢీకొని వృద్ధుడి మృతి

**నెల్లూరు క్రైమ్, జనవరి 7, ప్రభాతవార్త:** స్థానిక పెన్నా వంతెన సమీపంలో ప్రమాదవశాత్తు రైలు ఢీకొని గుర్తుతెలియని వృద్ధుడు మృతి చెందిన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. మృతుడికి సుమారు 70 ఏళ్ల పైబడి వయసు ఉంటుందని, తెలుపు రంగు చొక్కా, నీలిరంగు చెక్స్ కలిగిన లుంగీ ధరించి ఉన్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి రైల్వే ఎస్సై ఎన్.హరిచందన కేసు దర్యాప్తు చేపట్టారు.

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు మృతి

**కలువాయి జనవరి 7 ప్రభాతవార్త :** మండలంలోని నేషనల్‌ఎన్‌హెచ్ 5 ఉయ్యాలపల్లి సమీపంలో మంగళవారం రోడ్డు దాటుతు రోడ్డు ప్రమాదంలో అదే గ్రామానికి చెందిన పవన్ (25) అనే వ్యక్తిని గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో అక్కడిక్కడే మృతి చెందాడు. మృతుడ్ని పోస్టుమాస్టరం నిమిత్తం తరలించి ఎస్ఐ సుమన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అదే విధంగా వెంకటరెడ్డి పల్లి హైవే బ్రిడ్జి సమీపంలో రాపూరు మండలం అకిల వలసకి చెందిన చెన్నకేశవ (53) అనే వ్యక్తి బైక్ మీద వెళుతుండగా కారు ఢీకొనడంతో ప్రమాదానికి గురై 108 వాహనంలో తరలిస్తుండగా మృతి చెందారు.

## సచివాలయ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలి



**సైదాపురం, జనవరి 7, ప్రభాతవార్త :** గ్రామ సచివాలయాల్లో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి ప్రభుత్వం అందిస్తున్న పథకాలను అర్హులైన వారు పొందే విధంగా చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ పురుషోత్తం శివకుమార్ తెలిపారు. మండల పరిధిలోని ఊటుకూరు, తరిమెర్ల గ్రామ సచివాలయాలను ఆయన మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా హాజరు పట్టికలను, రికార్డులను తనిఖీ చేసి వివిధ సర్వేలలో సచివాలయం ప్రగతిని సమీక్షించారు. అనంతరం తురిమెర్ల గ్రామంలో వ్యవసాయ శాఖకు సంబంధించి పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.

## చేపల వేటలో మత్స్యకారుల మధ్య ఘర్షణ



**కలువాయి జనవరి 7 ప్రభాతవార్త :** మండలకేంద్రమైన కలువాయిలోని చెరువు ప్రాంతానికి సమీపంలో ఉండే సోమశిల,తెలుగుగంగ కాలువ బ్యాలెన్స్ రిజర్వాయర్ వద్ద మంగళవారం చేపలు పట్టేందుకు రెండు వర్గాలకు చెందిన మత్స్యకారులు మధ్య ఘర్షణతో కూడిన వాతావరణం చోటు చేసుకుంది. ఈ నేపథ్యంలో కలువాయి ఎస్ఐ కె.సుమన్ స్దానిక ప్రజాప్రతినిదులు జొక్యం చేసుకొని సర్దుబాటు చేయడంతో ఇరువర్గాల వారు సద్దుమణిగారు.కొన్ని సంవత్సరాల నుండి స్దానికంగా ఉండే ఎస్.టి ఇతర మత్యకారులు చేపలు పట్టుకుంటున్నామని బయట ప్రాంతాల నుండి మత్స్యకారులు మాపొట్ట కొడుతున్నారని స్దానిక మత్యకారులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈక్రమంలో బయట ప్రాంతానికి చెందిన పలువురు మత్యకారులు కూడా ఆ ప్రాంతంలోనే చేపలు వేటకు రావడంతో చిన్నపాటి ఘర్షణ వాతావరణం నెలకొంది. మత్స శాఖకు చెందిన పై అధికారులతో జరుగుతున్న సంఘటనను మాట్లాడిన ఎస్ఐ సుమన్ వారి సూచనలు సలహాల మేరకు బయట వ్యక్తులను వేటకు వెళ్ళేందుకు నిరాకరించడంతో వెనుతిరిగారు.సిఐ సత్యనారాయణ సంఘటనా స్దలానికి చేరుకొని అక్కడి పరిస్ధితిని తెలుసుకున్నారు. అనంతరం స్దానిక మత్యకారులు చేపల వేటను కొనసాగించారు.

## వీసీలో పాల్గొన్న ఎస్ఆర్జెసి సిబ్బంది



**లింగసముద్రం, జనవరి 7, ప్రభాతవార్త :** మండల ఉపాధి హామీ పథకం సిబ్బందికి క్షేత్ర సహాయకులు సాంకేతిక సహాయకులు రాష్ట్రస్థాయిలో ఆన్‌లైన్ ద్వారా రక్షణ కార్యక్రమం నిర్వహించారు. పంచాయతీ రాజ్ కమీషనర్ కృష్ణ తేజ రాబోవు రోజుల్లో ఉపాధి హామీ పథకంలో చేపట్టనున్న పనులపై దిశానిర్దేశం చేశారు. అలాగే సరాసరి వేతనం కొలతలు తీయు విధానం ఫారం పనులు చేయుట ఎన్‌ఎంఎంఎస్ హాజరు పంపుట మేట్ వ్యవస్థ ఏర్పాటు పలు అంశాలపై ఫీల్డ్ సిబ్బందికి శిక్షణ ఇవ్వడం జరిగింది.ఈ కార్యక్రమంలో లింగసముద్రం మరియు వలేటివారిపాలెం ఏపీవోలు, టీఏలు, ఎఫ్ఏలు పాల్గొన్నారు.

## 8న నియోజకవర్గ ఎన్డీఏ ఆత్మీయ సమావేశం



**ఉదయగిరి, జనవరి 7, ప్రభాతవార్త :** ఉదయగిరి నియోజకవర్గం కూటమి ఆత్మీయ సమావేశం ఉదయం 9గంటలకు వింజమూరు పట్టణంలోని ఎస్వీ కన్వెక్షన్ హాల్లో జరగనుందని నాయకులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయగిరి నియోజకవర్గం టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు కార్యకర్తలు, అభిమానులు ఆత్మీయ సమావేశంలో పాల్గొనాలని టీడీపీ మండల కన్వీనర్ బయన్న యాదవ్ కోరారు. ఈ కార్యక్రమానికి ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ఎడ్డి, శాసనసభ్యులు కాకర్ల సురేష్ పాల్గొని పలు అంశాలపై క్యాడర్‌కు దిశానిర్దేశం చేస్తారన్నారు.

## 10వ తరగతి విద్యార్థులకు శిక్షణ తప్పనిసరిగా నిర్వహించాలి



**ఉదయగిరి, జనవరి 7, ప్రభాతవార్త :** ఉదయగిరి మండల విద్యాశాఖాధికారి-2 తోట శ్రీనివాసులు మంగళవారం ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉదయగిరి నందు పదో తరగతి విద్యార్థులకు నిర్వహించే 100 రోజుల శిక్షన తరగతులను పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యాశాఖాధికారి విద్యార్థులకు ఉపాధ్యా యులకు పలు సూచనలు చేశారు. ప్రతి విద్యార్థి ఉదయం సాయంత్రం పూట జరిగే 100 రోజుల శిక్షన కార్యక్రమాలకు హాజరు కావాలి. పాధ్యాయులచే సకాలంలో సిలబస్ పూర్తి చేయించుకునే బాధ్యత విద్యార్థులదే, విద్యార్థుల సందేహాల నివృత్తికి ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఎప్పటికప్పుడు స్పందిస్తూ ఉండాలి, చదువులో వెనుకబడిన విద్యార్థులకు రెమిడీయల్ తరగతులు నిర్వహించాలి, సెల్‌ఫోన్స్ ఉపయోగించరాదు, పండుగ మూడు రోజులు తప్పితే మిగతా సెలవు దినములలో కూడా శిక్షణా తరగతులు నిర్వహించాలి. ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉదయగిరి నియోజకవర్గ కేంద్ర స్థానంలో ఉండుటచే ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు బాధ్యతగా విద్యార్థులు మంచి మార్కులతో నూటికి నూరుశాతం ఉత్తీర్ణత సాధించే విధంగా కృషి చేయాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వి.బాలకేశవులు పాల్గొన్నారు.

## ఉపాధి పనులు పకడ్బందీగా చేపట్టాలి



**ఉదయగిరి, జనవరి 7, ప్రభాతవార్త :** ఉదయగిరి మండలం పరిధిలోని 17 పంచాయతీలో మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంకు సంబంధించిన పనులను పకడ్బందీగా నిర్వహించాలని ఆ శాఖ కమీషనర్ డైరక్టర్ తహశీల్దార్ కార్యాలయం నందు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సూచించారు. మంగళవారం తహశీల్దార్ కార్యాలయంలో జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌కు ఉపాధి కార్యాలయ సిబ్బంది హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రానున్న ఆరు నెలలో చేపట్టాల్సిన పనులపై సమీక్షించారు. క్షేత్ర స్థాయిలో సిబ్బంది అనుసరించాల్సిన పద్దతులపై పలు సూచనలు చేశారు.

## సమగ్ర సస్యరక్షణ, యాజమాన్య పద్దతులపై శిక్షణ



**ఉలవపాడు, జనవరి 7, ప్రభాతవార్త :** కృషి విజ్ఞాన కేంద్రం, కందుకూరు సీనియర్ శాస్త్రవేత్త, హెడ్ డాక్టర్ జీ.ప్రసాద్‌బాబు ఆధ్వర్యంలో ఉలవపాడు మండలంలో అలగాయపాలెం, బట్టిసోమపాలెం టెంకాయ చెట్లపాలెం గ్రామ వేరుశనగ రైతులకు జాతీయ ఆహార భద్రత మిషన్ కింద సామూహిక ప్రధమ శ్రేణి ప్రదర్శనా క్షేత్రాల నిర్వహణలో భాగంగా సమగ్ర పోషకాల యాజమాన్యం, సమగ్ర సస్యరక్షణపై శిక్షణా కార్యక్రమాన్ని, రోగ నిర్ధారణ సందర్శనలను చేపట్టడం జరిగింది. సీనియర్ శాస్త్రవేత్త మాట్లాడుతూ వేరుశనగ ప్రస్తుతం పూత మైర్యా వూడలు దిగే దశలో ఉందని ఈ దశలో అందరూ రైతులు ఎకరాకు 200 కిలోల జిప్సం ఎరువును చల్లుకొని భూమిలో కలుపుకోవడం ద్వారా వూడలకు కావాల్సిన కాల్షియం, నూనె పెరగడానికి కావాల్సిన సల్ఫర్ అందుబాటులోకి వచ్చి అధిక కాయ దిగుబడి తీసుకోవచ్చని తెలిపారు. అలాగే రైతులతో కలిసి పొలాలను సందర్శించడం జరిగింది. ఇందులో ప్రస్తుతం కాండం కుళ్ళు, తెగులు, మచ్చ తెగులు గమణించడం జరిగింది. కాండం కుళ్ళు తెగులు నివారణకు ట్రైకోడెర్మా విరిడి మరియు సూడోమోనాస్ జీవ శిలీంద్ర నాసినులను ఎకరాకు 2 కిలోల చొప్పున 100 కిలోల పేడ ఎరువులో కలుపుకొని 15 రోజులు మగ్గబెట్టి పొలంలో సమానంగా ఆఖరు దుక్కిలో వేసుకోవాలని తెలిపారు. అలాగే మచ్చ తెగుళ్ళ నివారణకు ఎకరాకు హెక్సా కొనజోల్ 400 మి.లీ లేదా టెబుకొనజోల్ మందును ఎకరాకు 200 మి.లీ 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేసుకోవాలని తెలిపారు. అలాగే బంతి పంటలో వేరుకుళ్ళు తెగులు గమణించడం జరిగిందని, దీని నివారణకు లీటరు నీటికి కాపర్ ఆక్సీ క్లోరైడ్ 3 గ్రాములు కలుపుకొని మొక్క మొదళ్ళలో పోసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ వెంకటేష్, డాక్టర్ జ్యోతి, మాయాంక్, డాక్టర్ శ్రీరంగ ఉలవపాడు మండల వ్యవసాయాధికారిణి తిరుమల జ్యోతి, రైతు సేవా కేంద్రం వీఏఏ వంశీ, రైతులు, రైతు మహిళలు, ఏపీ ప్రకృతి వ్యవసాయ సిబ్బంది కృష్ణారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

## నేడే ఆత్మీయ సమావేశం



**వింజమూరు, జనవరి7,ప్రభాతవార్త:** వింజమూరు ఎస్‌విఎస్ కళ్యాణమండపం ప్రాంగణంలో బుధవారం నియోజకవర్గ తెలుగుదేశం, జనసేన, బిజెపి పార్టీల ఆత్మీయ సమావేశాన్ని నెల్లూరు ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పేర్కొన్నారు. ఈసమావేశంలో నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరుకావాలని ఆయన కోరారు. ఈకార్యక్రమంలో వేమిరెడ్డి కార్యాలయ మేనేజర్ విశ్వం, నాయకులు పూసల వెంగపనాయుడు, రాంగోపాల్, ఇతర నాయకులు పాల్గొన్నారు.

## కూలీలకు కనీస వేతనం 300 ఇవ్వాలి



**వింజమూరు, జనవరి7,ప్రభాతవార్త:** ఉపాదిహామీ పనులకు వస్తున్న కూలీలకు కనీస వేతనం రోజుకు 300రూపాయలు అందించాలని పిఆర్ అండ్ ఆర్‌డి కమీషనర్ ఫీల్డ్ అసిస్టెంట్లకు దిశ నిర్దేశం చేశారు. బుధవారం ఎంపిడిఓ కార్యాలయంలో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఉపాదిహామీ పథకం చట్టం ఉద్దేశం, ఫీల్డ్ అసిస్టెంట్ విధులు, బాధ్యతలు గురించి, వేతన దారులకున్న హక్కుల గురించి, జనవరి నుండి జూన్ ఏప్ పనులు చేయాలి అన్న విషయాలను తెలిపారు. ఈకార్యక్రమానికి ఎంపిడిఓ శ్రీనివాసులురెడ్డి, ఎపిఓ సుభాన్, క్లస్టర్ టిఎ చెన్నయ్య, ఇసి రామ్మోహన్ , ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు. ఈసందర్భంగా ఎంపిడిఓ మాట్లాడుతూ గ్రామాల్లో కమ్యునిటీ , వ్యక్తిగత ఆస్తులను కల్పించేలా ఫీల్డ్ అసిస్టెంట్లు పనిచేయాలన్నారు. ఫారంపాండ్స్, అమృత్‌సరోవర్, ఫిష్‌పాండ్స్, వింగ్‌ట్రెంచ్ , సరిహద్దు కందకాలు తదితర పనులు చేయడం వలన పేదలు తమ జీవనోపాదిని పెంపొందించుకోవచ్చన్నారు. 50మంది ఎస్‌ఎస్‌ఎస్ గ్రూపులను ఏర్పాటు చేసుకొని ఆ గ్రూపులకు మేట్‌లను ఏర్పాటు చేసుకోవాలన్నారు. గ్రామపంచాయతీ లెవల్లో నిర్వహించాల్సిన రికార్డులు సక్రమంగా ఉండాలన్నారు. పనులకు సంబంధించిన పనివివరాల బోర్డును ఏర్పాటు చేయాలన్నారు. ఎంఎంఎస్ అటెండెన్స్‌ను మొబైల్ యాప్‌ద్వారా పంపాలన్నారు. జాబ్‌కార్డ్ అప్‌డేషన్, వర్క్‌వైజ్ ఫైల్ ను , 7రిజిస్టర్లను నిర్వహించాలన్నారు. ఈకార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

## ఈనెల 8న ఎంపి,ఎమ్మెల్యేల ఆత్మీయ సమావేశం విజయవంతం చేయండి



**సీతారామపురం జనవరి 7 ప్రభాతవార్త :** ఈనెల 8 వ తేది ఉదయం 9 గంటలకు వింజమూరులోని ఎస్‌వి కన్వెన్షన్ హాల్ నందు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి,ఉదయగిరి నియోజకవర్గ శాసనసభ్యులు కాకర్ల సురేష్ ఆత్మీయ సమావేశానికి టిడిపి, జనసేన,బిజెపి నాయకులు మరియు కార్యకర్తలు భారీగా తరలివచ్చి ఆత్మీయ సమావేశాన్ని జయప్రదం చేయాలని టిడిపి మండల కన్వీనర్ కప్పా ప్రభాకర్‌రాజు కోరారు. ఈకార్యక్రమంలో టిడిపి నాయకులు ఎడమ ప్రవీణ్,పిడుగు రమేష్,సింగాల నాగేశ్వరరావు ,రఘురా మయ్య, అల్లూరయ్య, కార్యకర్తలున్నారు.

## సబ్ స్టేషన్ ను సందర్శించిన ఏడి సతీష్



**సంగం జనవరి 7 ప్రభాతవార్త :** సంగం సబ్‌స్టేషన్‌ను బుచ్చిరెడ్డిపాళెం సబ్‌డివిజన్ ఏడి సతీష్ సందర్శించారు.ఈ సందర్భంగా ఏఇ మన్మదరావును పిఎం సూర్యఘర్ రిజిస్ట్రేషన్ పురోగతి గురించి అడిగి తెలుసుకున్నారు.బుచ్చి సబ్‌డివిజన్ పరిధిలో ఎస్‌సి,ఎస్‌టి వినియోగదారులకు పిఎం సూర్యఘర్ పథకం కి సంబందించి ఇప్పటికే 3 వేల రిజిస్ట్రేషన్లు చేసినట్లు ఏడి తెలిపారు. ఎస్‌సి,ఎస్‌టి వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగ చేసుకోవాలని ఆయన కోరారు.

## ప్రతి పంటను ఈ పంటలో నమోదు చేయాలి



**కలువాయి జనవరి 7 ప్రభాతవార్త :** మండలంలోని వేసిన ప్రతి ఎకరా " ఈ" పంటలో నమోదు అయ్యే విధంగా సమాచారం సేకరించి పంట నమోదు చేయాలని సూక్ష్మ బిందు సేద్యం, జిల్లా ప్రాజక్టు అధికారి బి.శ్రీనివాసులు తెలిపారు. మండలంలోని తోపు గుంట గ్రామంలో మంగళవారం డ్రిప్ ఇరిగేషన్ చివరి తనిఖీ బొప్పాయిలో నిర్వహించారు. అనంతరం వ్యవసాయాధికారి కార్యాలయం నందు వీఏఏలకు సమీక్ష సమావేశం నిర్వహించి మండలంలో ఆన్‌లైన్‌లో నమోదు అయినటువంటి లబ్దిదారులకు త్వరితగతిన తనీఖి నిర్వహించి డ్రిప్ వారి పొలాల్లో ఏర్పాటు చేసే విధంగా పూర్తి చర్యలు తీసుకోవాలని తెలియజేశారు. అనంతరం వ్యవసాయ సంచాలకులు కే.శివ నాయక్ బద్వేల్ గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించి డ్రమ్ సీడర్ చేసిన వరి రైతులు కలుపు, యాజమాన్యం అదే విధంగా ఉల్లికోడుపై తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలపై రైతులకు తగు సూచనలు ఇచ్చారు.అదే విధంగా పంట నమోదు పూర్తి చేయాలని ఆదేశించారు. ఈకార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి వి.ప్రతాప్,మండల టిడిపి నాయకులు చల్లా రఘురామిరెడ్డి, ఏ.వో ప్రసాద్,ఏ.ఈ.ఓలు పాల్గొన్నారు.

## జీజీహెచ్‌లో హెచ్‌ఎంపీ వైరస్ వార్డు ఏర్పాటు



**నెల్లూరు, జనవరి 7, ప్రభాతవార్త-వైద్యం :** చైనాలో ఆందోళన సృష్టిస్తున్న హెచ్‌ఎంపీ వైరస్ ఇండియాను తాకింది. ఇప్పటికే మహారాష్ట్ర, కర్ణాటక, తమిళనాడు, గుజరాత్ తదితర రాష్ట్రాల్లో ఈ వైరస్ పలువురికి సోకింది. దీంతో కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాక సూచనలతో అప్రమత్తమైంది. రాష్ట్ర డైరక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ ఆదేశాలతో నెల్లూరులోని ప్రభుత్వ పెద్దాసుపత్రిలో 20 పడకలతో ప్రత్యేక హెచ్‌ఎంపీ వైరస్ వార్డును మంగలవారం ఏర్పాటు చేశారు. 10 పడకలతో సాధారణ వార్డు, మరో 10 పడకలతో క్రిటికల్ వార్డును సిద్ధం చేశారు. హెచెం వైరస్ సోకన రోగులకు వైద్యం అందించేందుకు ప్రత్యేక వైద్య బృందాన్ని ఏర్పాటు చేశారు. అంతేకాబందా స్టాండ్ సంబంధించిన అన్ని రకాల మందులను లోకల్ పర్చేజ్లో అత్యవసరంగా కొనుగోలు చేసేందుకు బంట్లు ఇచ్చారు. రోగులు వస్తే అందించాల్సిన సేవలపై ఇన్‌ఛార్జీ సూపరిండెంటెండ్ డాక్టర్ నరేంద్ర ఫారెస్ట్ సర్కుంచు, డాక్టర్లు, నర్సులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి సూపరింటెండెంట్ కాట్మ మాట్లాడుతూ వైరస్ సోకిన రోగులకు ఆధునిక వైద్యం అందించేందుకు అన్ని తికాల ప్రత్యామ్నాయాలు సత్యాలు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు మస్తాన్, గంగాధర్, అమ్మనిస్ట్రేట్ హెడిన వాండ్ కళారాణి తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టర్‌చే ఏపీ ఎన్‌జీజీఓస్ 2025 వ సంవత్సరం టేబుల్ క్యాలెండర్ ఆవిష్కరణ



**నెల్లూరు, జనవరి 7, ప్రభాతవార్త - కలెక్టరేట్ :** మంగళవారం నెల్లూరు కలెక్టర్ మరియు జిల్లా మెజిస్ట్రేట్ ఓ.ఆనంద్ ని కలిసి నూతన సంవత్సరం మరియు సంక్రాంతి శుభాకాంక్షలు తెలియచేసిన ఏ పీ ఎన్ జీ జీ ఓస్ అసోసియేషన్ సభ్యులు , అనంతరం జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ఏ పీ ఎన్ జీ జీ ఓస్ అసోసియేషన్ శ్రీ పొట్టి శ్రీ రాములు నెల్లూరు జిల్లా శాఖ 2025వ సంవత్సరం టేబుల్ క్యాలెండర్ ఆవిష్కరణ చేయించడం జరిగింది. ఈ కార్యక్రమం ఏ పీ ఎన్ జీ జీ ఓస్ అసోసియేషన్ శ్రీ పొట్టి శ్రీ రాములు నెల్లూరు జిల్లా అధ్యక్షులు మన్నేపల్లి పెంచలరావు ఆధ్వర్యములో జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు బండారుపల్లి వెంకటేశ్వర్లు, జిల్లా కార్యదర్శి రామకృష్ణ,అసోసియేట్ అధ్యక్షులు ఆంజనేయవర్మ కోశాధికారి ప్రసాద్ రెడ్డి,ఆర్గనైజింగ్ కార్యదర్శి పెంచలయ్య, ఉపాధ్యక్షులు కరుణమ్మ, కృష్ణంరాజు, కిరణ్, సతీష్ బాబు, సంయుక్త కార్యదర్శులు గిరిధర్ విజయకుమార్, రాజేంద్ర ప్రసాద్, కృష్ణకుమార్, సువర్ణ, మహిళా సంఘం అధ్యక్షులు చిన్నమ్మ, తదితరులు పాల్గొన్నారు.

## విఎస్‌యూలో కిషోరివికాస్ కార్యక్రమం




**వెంకటాచలం, జనవరి 7, ప్రభాతవార్త:** విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం లో ఎన్ఎస్ఎస్ విభాగం మరియు శిశు సంక్షేమ శాఖ సంయుక్తంగా కిషోరి వికాసం అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఎస్. విజయ భాస్కర రావు, విశిష్ట అతిథిగా విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ డాక్టర్ కె. సునీత హాజరయ్యారు. ఈ సందర్భంగా, వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఎస్. విజయ భాస్కర రావు గారు మాట్లాడుతూ "మహిళల సాధికారతకు విద్య ముఖ్య సాధనం. క్రమశిక్షణ, శారీరక ఆరోగ్యం, మరియు ఆత్మవిశ్వాసం ద్వారా వారు సమాజంలో అగ్రస్థానాన్ని సాధించగలరు. బాల్య వివాహాలు కేవలం వ్యక్తుల జీవితాలను ప్రభావితం చేయడమే కాదు, సమాజ ప్రగతిని కూడా అడ్డుకుంటాయి. సమాజంలో ప్రతి ఒక్కరూ ఈ సమస్యపై అవగాహన కలిగి ఉండాలి" అని అన్నారు. రిజి స్ట్రార్ డాక్టర్ కె. సునీత గారు తన ప్రసంగంలో "బాల్య వివాహాల నివారణ కోసం యువతుల చైతన్యంతో పాటు సమాజం మొత్తం భాగస్వామ్యం కావాలి. ఇది పిల్లల హక్కులను కాపాడే ఒక కీలకమైన అడుగుగా నిలుస్తుంది" అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆచార్య సుజా ఎస్ నాయర్, పరిక్షల నియం త్రణ అధికారి డాక్టర్ ఆర్ మధుమతి, యన్ ఎస్ ఎస్ సమన్వయకర్త డాక్టర్ ఉదయ్ శంకర్ అల్లం, యన్ ఎస్ ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ బి వి సుబ్బా రెడ్డి, జిల్లా బాలల సంరక్షణా అధికారి శ్రీ బి.సురేష్, ఎ సి డి పి ఓ అనురాధ, పిడిపిసిడిఎస్ సుశీల దేవి మరియు విద్యార్థిని విద్యార్థులు పాల్గొనారు.

## పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎంఇఓ గోవిందయ్య



**కావలిరూరల్, జనవరి07 ప్రభాతవార్త :** కావలి మండలంలోని మార్కండేయపురం ప్రాథమిక పాఠశాలను మంగళవారం కావలి మండల విద్యాశాఖ అధికారి బండి గోవిందయ్య ఆకస్మికంగా తనిఖీచేయడం జరిగింది. పాఠశాల రికార్డులను పరిశీలించారు. విద్యార్థిని, విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించి మధ్యాహ్న భోజనాన్ని స్వయంగా రుచిచూడడం జరిగింది. పాఠశాల ఆవరణను క్షుణ్ణంగా పరిశీలించారు. పై విషయాలపట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులకు తగు సూచనలు, సలహాలు ఇవ్వడం జరిగింది. అనంతరం పాఠశాల విద్యాకమిటి ఛైర్మన్ కె.స్వాతి, ప్రధానోపాధ్యాయులు పి.చెన్నక్రిష్ణయ్యలు ఎంఇఓ దృష్టికి శిథిలావస్థలో ఉన్న పాఠశాల పాతభవనాన్ని మరమ్మత్తులు చేసేందుకు, పాఠశాల ప్రహరీ నిర్మాణం, రన్నింగ్ వాటర్ వసతులు వంటి సమస్యల పరిష్కారానికి సహకరించాలని కోరారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పాఠశాలలోని సమస్యల పరిష్కారానికి తనవంతు కృషిచేస్తానని ఎంఇఓ హామీ ఇవ్వడం జరిగింది. ఉపాధ్యాయుల, పాఠశాలలోని సమస్యల పరిష్కారానికి పూనుకుంటూ సానుకూల దృక్పథాన్ని వ్యక్తం చేస్తున్న మండల విద్యాశాఖ అధికారి గోవిందయ్యను ఉపాధ్యాయులు, విద్యార్థులు దుశ్శాలువాతో ఘనంగా సత్కరించడం జరిగింది. కొత్తసత్రం, శ్రీరామపురం, తుమ్మలపెంట, డిపిఈపి తదితర పాఠశాలలను కూడా వరుసగా తనిఖీ చేసినట్లు తెలియచేయడం జరిగింది.

## గుండెపోటుతో ట్రాన్స్‌కోఎఇ మృతి



**జలదంకి, జనవరి7, ప్రభాతవార్త:** జలదంకి ట్రాన్స్ కోఎఇ కృష్ణకిషోర్ (50) గుండెపోటుతో మంగళవారం ఉదయం మృతిచెందాడు, హైదరాబాగులోని తన నివాసంలో తెల్లవారుజామున గుండె నొప్పిగవుందని కుటుంబసభ్యులకు తెలియజేశాడు వారు కంగారుపడి ఆసుపత్రికి తరలించేలోపే మృత్యువాత పడ్డట్టు కార్యాలయవర్గాలు తెలియజేశాయి. ఎఇ మృతిచెందారన్న వార్తతో కార్యాలయ సిబ్బందితోపాటు పలువురు ఆయన మిత్రులు, శ్రేయోభిలాషులు విషాదంలో మునిగిపోయారు. సౌమ్యుడు, నిబద్ధతగల అదికారి అకాల మృతి తమను కలచివేచిందని వారు విచారం వ్యక్తంచేశారు. ఆయనకు భార్య కుమారుడు వున్నారు.

## ఇండిగ్యాప్ పొలంబడి



**బిట్రగుంట జనవరి 7 ప్రభాతవార్త:** బోగోలు మండలం జక్కేపల్లి గూడూరు గ్రామంలో మంగళవారం ఇండి గ్యాప్ పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు సస్య రక్షణ యాజమాన్య పద్ధతులు గురించి అవగాహన కల్పించారు. వరి పంటకు తెగుళ్ల నివారణకు ఏ మోతాదులో పురుగు మందులు వాడాలో వివరించారు. వరి పంట వేసిన ప్రతి రైతు ఈ క్రాప్ నమోదు చేసుకోవాలని పంట బీమాకు ఈనెల 15 వరకు గడువు పొడిగించినట్లు మండల వ్యవసాయ శాఖ అధికారిణి విజయలక్ష్మి తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ శాఖ సహాయకులు రైతులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ



**ఆత్మకూరు, జనవరి7, ప్రభాతవార్త:** మండలంలోని నాగులపాడు పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు షేక్ షబ్బీర్ నోట్‌బుక్స్, జామెంట్రీ బాక్సులు , పెన్స్, పెన్సిల్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సురేంద్రరెడ్డి మాట్లాడుతూ షబ్బీర్ మేనమామ సయ్యద్ నాయబ్‌రసూల్ పుట్టిన రోజు సందర్భంగా విద్యార్థులకు ఈ మెటీరియల్‌ను పంపిణీ చేశారని ఎంతో ఆనందంగా ఉందన్నారు. అనంతరం కేక్ కట్‌చేసి విద్యార్థులకు పంచిపెట్టారు. ఈకార్యక్రమంలో స్కూల్ వైస్ చైర్మెన్ బొర్రా హరిత, టిడిపి నాయకులు పేర్నాటి అడివిరెడ్డి, గోగుల రోశయ్య, కరేటి శ్రీనివాసులురెడ్డి, పేర్నాటి బాలకృష్ణారెడ్డి, బొబ్బల రవీంద్ర, బొబ్బల మల్లెకొండయ్య, షేక్ కరీం, షేక్ చిన్నబాష, షేక్ అబ్దుల్ రహమాన్, షేక్ బాష, షేక్ యస్దాని, షేక్ ఖాజా రసూల్, బట్టా పెంచలనరసయ్య, చలంచెల్ల కుమారి, కోలా నర్సింహులు , టిడిపి నాయకులు, నాయబ్ యువసేన తదితరులు పాల్గొన్నారు.

## రక్తదానం ఒక ముఖ్యబాధ్యతగా భావించాలి
## మానవ వనరుల విభాగపు అధికారి సింహాద్రి



**కావలి, జనవరి07 ప్రభాతవార్త :** ప్రతి మానవ జీవితంలో రక్తదానం ఒక ముఖ్యబాధ్యతగా భావించాలని, రక్తదానంకు ప్రత్యామ్నాయసేవ మరొకటలేదని ఇండోసోల్ సోలార్ ప్రైవేట్‌లిమిటెడ్ కంపెనీ మానవవనరుల విభాగపుఅధికారి సింహాద్రి హరీష్ తెలి్పారు. మంగళవారం ఇండోసోల్ సోలార్ కంపెనీలో రక్తదానశిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 63మంది ఉద్యోగులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్పొరేట్ సామాజిక బాధ్యతగా తమ ఉద్యోగులు ప్రతి సంవత్సరం 2 సార్లు రక్తదానం చేయాలని ముందుకు వచ్చారన్నారు. కావలి సమీపంలోని చేవూరు గ్రామపరిధిలో ఈ కంపెనీ ఉందన్నారు. తమ కంపెనీ యాజమాన్యం రక్తదానాన్ని ప్రోత్సహిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కావలి రెడ్‌క్రాస్ రక్తకేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రాథమిక దశ నుంచి దంతాలపట్ల ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలి




కోవూరు, జనవరి 7 ప్రభాతవార్త : ప్రాథమిక దశ నుంచి విద్యార్థులు దంతాల ఆరోగ్యం పట్ల ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని డాక్టర్ కొండారెడ్డి దంత వైద్య శాల వైద్యులు డాక్టర్ మురళీకృష్ణ, డాక్టర్ సోనియాలు తెలిపారు. కోవూరులోని పచ్చిపాల రామనాథమ్మ జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల సమావేశ మందిరంలో మంగళవారం దంత వైద్యశాల ఆధ్వర్యంలో ఉచిత దంత పరీక్షల క్యాంపు నిర్వహించి అనంతరం విద్యార్థులకు పేస్టు బ్రష్‌లను ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దంతాల పట్ల నిర్లక్ష్యం చేస్తే ఆరోగ్య పరిస్థితి ఇబ్బందికరంగా మారుతుందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ప్రతి రోజూ విద్యార్థులు రెండుసార్లు బ్రెష్ చేసుకునేలా చర్యలు తీసుకుని తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. ఈ సందర్భంగా 300 మంది విద్యార్థినులకు పరీక్షలు నిర్వహించి వారికి మందులతో పాటు బ్రెష్, పేస్టులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయిని ఝాన్సీరాణి, ఫిజికల్ డైరెక్టర్ దేవిక, పీఈటీ వెంకటసుబ్బమ్మ, పీఆర్‌వో రాజశేఖర్, మేనేజర్ ప్రవీణ్, రేవతిలు ఉన్నారు.

## పార్టీ సమావేశానికి బయలుదేరిన ప్రజాప్రతినిధులు




కోవూరు, జనవరి 7 ప్రభాతవార్త : తాడేపల్లి వైసీపీ కేంద్ర కార్యాలయంలో బుధవారం జరగనున్న ఎంపీపీ , జెడ్పీటీసీల సమావేశానికి కోవూరు నియోజకవర్గం నుంచి వైసీపీ ఎంపీపీలు, జెడ్పీటీసీలు వాహనంలో బయలుదేరారు. మంగళవారం వీరి వాహనాన్ని వైసీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నిరంజన్‌బాబురెడ్డి ప్రారంభించి క్షేమంగా చేరుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కోవూరు నియోజకవర్గ పరిధిలోని వైసీపీ ఎంపీపీలు, జెడ్పీటీసీలు ఉన్నారు.

## వ్యవసాయ శాఖ సలహాలు సూచనలు పాటించాలి



**చెర్లోపాలెం( కోవూరు), జనవరి 7 ప్రభాత వార్త :** వ్యవసాయం సాగు చేసే రైతులు వ్యవసాయ శాఖ సలహాలు, సూచనలు పాటించాలని సహాయ వ్యవసాయ సంచాలకులు సుజాత తెలిపారు. కోవూరు మండలం చెర్లోపాలెం గ్రామంలోని రైతు సేవా కేంద్రంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా రైతులకు పలు విషయాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముందుగా నాటిన బీపీటీ 5204 పైరు నందు కొడుపులు ఉన్నాయని, పైరు నాటిన 45 రోజుల లోపల పిలకదశ అయిపోతుందని, ఆ దశలో కొడుపుల గురించి రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. కేవలం లేత నారులో కొడుపులు ఉంటే కార్బోఫిరాన్ త్రీజీ గుళికలు ఎకరాకు 10 కిలోలు తక్కువ నీరు ఉంచి వాడుకోవాలన్నారు. దీని వలన వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. ఇప్పటివరకు పొటాష్ వేయని వారు తప్పకుండా ఎకరాకు 35 కిలోలు రెండు దఫాలుగా వాడుకోవాలని సూచించారు. అవసరమైతే తప్ప అనవసరంగా పురుగుమందులు పిచికారి చేయవద్దని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారిణి ఇందిరావతి, వీఏఏ నారాయణ, కెనరా బ్యాంక్ ఫీల్డ్ ఆఫీసర్ రవి శంకర్, రైతులు ఉన్నారు.

## మార్చి 25 నాటికి నూరుశాతం నిర్మాణాలు పూర్తికావాలి



కోవూరు, జనవరి 7 ప్రభాతవార్త : కోవూరు మండలంలోని అన్ని గ్రామాల్లో ఇళ్ల నిర్మాణాలు చేపట్టిన లబ్దిదారులు వాటిని మరింత వేగవంతం చేసి సకాలంలో నిర్మాణాలు పూర్త య్యేలా ఇంజనీరింగ్ అసిస్టెంట్లు ప్రత్యేక చొరవ తీసుకోవాలని ఎంపీడీవో శ్రీహరిరెడ్డి అన్నారు. కోవూరులోని మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం మండలంలోని అన్ని గ్రామాలకు సంబంధించిన ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంజనీరింగ్ అసిస్టెంట్ వారికి ఇచ్చిన లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలన్నారు. లేనిపక్షంలో వారిపై తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. మార్చి నాటికి నూరుశాతం నిర్మాణాలు పూర్తి కావాలని ఈ విషయంలో లబ్దిదారుల్లో అవగాహన కల్పించి సకాలంలో నిర్మాణాలు పూర్తయ్యేలా తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గృహనిర్మాణ శాఖ ఏఈ మాధవయ్య, గృహ నిర్మాణ శాఖ వర్క్ ఇన్‌స్పెక్టర్లు , ఇంజనీరింగ్ అసిస్టెంట్లు ఉన్నారు.

## జిల్లా స్థాయి క్రీడాపోటీల్లో గీతాంజలి పాలిటెక్నిక్ విద్యార్థుల విజయభేరి



**కోవూరు, జనవరి 7 ప్రభాతవార్త :** ఉమ్మడి నెల్లూరు జిల్లా గూడూరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఈ నెల మొదటి వారం నిర్వహించిన ఇంటర్ కాలేజియేట్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మేట్ జిల్లా స్థాయి క్రీడా పోటీల్లో గీతాంజలి పాలిటెక్నిక్ విద్యార్థులు విజయఢంకా మోగించారని కళాశాల కార్యదర్శి ఎన్. సుధాకర్‌రెడ్డి తెలిపారు. ఈమేరకు మంగళవారం కళాశాల ఆవరణంలో విద్యార్థుల అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల కోశాధికారి వై. విజయశంకర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు కేవలం చదువే కాకుండా క్రీడల పట్ల కూడా దృష్టి సారిస్తే మానసిక ఉల్లాసం, క్రీడానైపుణ్యం పెరిగి మేదస్సు మరింత పదునెక్కుతుందన్నారు. ముఖ్యంగా ఆరోగ్యం, నాయకత్వ లక్షణాలు క్రీడా స్ఫూర్తి పెంపొందుతాయన్నారు. తమ కళాశాలలో క్రీడలను ప్రోత్సహించడం ద్వారా విద్యార్థుల మానసిక వికాసానికి కృషి చేస్తున్నామన్నారు. కళాశాల ఫిజికల్ డైరెక్టర్ అశోక్‌కుమార్ మాట్లాడుతూ జిల్లా స్థాయి క్రీడా పోటీల్లో తమ కళాశాల బాలికలు, వ్యక్తిగత చాంపియన్ షిప్ , బాలురు గేమ్స్ చాంపియన్స్ షిప్, ఓవరాల్ చాంపియన్ షిప్ కూడా సాధించారన్నారు. బాల్ బ్యాడ్మింటన్, టేబుల్ టెన్నిస్ క్రీడల్లో విజేతలుగా, కబడ్డీ , ఖోఖో పోటీల్లో రన్నర్ గా వచ్చారని ఈ సందర్భంగా ఆయన తెలియజేశారు. నెల్లూరు జిల్లా స్థాయిలో తమ కళాశాల ఓవరాల్ చాంపియన్ షిప్ సాధించడం ఇది వరుసగా మూడవ సారి అన్నారు. తమ కళాశాల ఓవరాల్ చాంపియన్ షిప్ సాధించడం తమకెంతో గర్వకారణం అన్నారు. గెలుపొందిన విద్యార్థులు ఈ నెల 28,29,30 తేదీల్లో విశాఖపట్నంలో జరిగే రాష్ట్రస్థాయి స్పోర్ట్స్ మీట్‌లో పాల్గొంటారన్నారు. ఈకార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ సందీప్‌కుమార్, అడ్మిషన్ డీన్ డాక్టర్ టీఎస్‌వీఎల్ఎన్ కుమార్, విభాగాధిపతులు, అధ్యాపకులు ఉన్నారు.

## చదవడం, రాయడంపై ప్రత్యేక దృష్టి సారించాలి




**వేగూరు( కోవూరు), జనవరి 7 ప్రభాతవార్త :** ప్రాథమిక దశ నేంచి ప్రతి విద్యార్థి చదవడం, రాయడంపై ప్రత్యేక దృష్టిసారించాలని ఎంఈవో-2 వై. చెంచులక్ష్మమ్మ అన్నారు. కోవూరు మండలం రామాపురం, వేగూరులోని ప్రాథమిక పాఠశాలలను మంగళవారం ఆమె ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉపాధ్యాయులు కూడా విద్యార్థులకు ఆట పాటలతో కూడిన విద్యను అందించాలని, అప్పుడే వారు ఉత్సాహంగా బడికి వస్తారన్నారు. అదేవిధంగా మధ్యాహ్న భోజన పథకం ఏజెన్సీలు ప్రభుత్వం నిర్దేశించిన మెనూను నాణ్యతా ప్రమాణాలతో అందించాలన్నారు. ఈ సందర్భంగా ఆమె ప్రధానోపాధ్యాయులకు పలు సూచనలు చేశారు.

## తహశీల్దారు కార్యాలయ ఆవరణంలో పెట్రోల్‌బంక్ పనులను అడ్డుకున్న టిడిపి హోరెత్తిన టిడిపి నేతల నిరసన ప్రదర్శన



**కావలి, జనవరి07 ప్రభాతవార్త :** కావలి పట్టణ తహశీల్దారు కార్యాలయ ఆవరణంలో ఏర్పాటుచేస్తున్న పెట్రోల్‌బంక్ నిర్మాణపనులను టిడిపినేతలు, పట్టణప్రజలు తీవ్రస్థాయిలో అడ్డుకుని మండిపడ్డారు. మంగళవారం తహశీల్దారు కార్యాలయ ఆవరణంలోకి వారంతా తరలివెళ్లారు. పెట్రోల్‌బంక్ నిర్మాణపుపనులు చేస్తున్నవారిని అడ్డుకున్నారు. ఒక్కసారిగా నిరసన నినాదాల ప్రదర్శన అక్కడ హోరెత్తింది. పక్కనే ఉన్న తహశీల్దారు కార్యాలయంలోకి టిడిపినేతలు, ప్రజలు వెళ్లారు. ఈ నిర్మాణం పనులను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. తహశీల్దారు కార్యాలయ ఆవరణంలో సబ్‌రిజిస్ట్రార్ ఆఫీసు, రూరల్ పోలీసుస్టేషన్, సబ్‌ట్రెజరీ కార్యాలయం, రూరల్ సర్కిల్ కార్యాలయం, వాతావరణశాఖ కార్యాలయం, సబ్‌జైలు, వ్యవసాయశాఖ కార్యాలయాలు ఉన్నాయన్నారు. నిత్యం వేలాదిమంది ప్రజల రాకపోకలతో ఈ ప్రాంతం రద్దీగా ఉంటుందన్నారు. పెట్రోల్‌బంక్ ఏర్పాటువల్ల వాహనాల పార్కింగ్‌కు, ప్రజల రాకపోకలకు తీవ్ర అసౌకర్యం కలుగుతుందన్నారు. గత వైసిపి ప్రభుత్వం, ఆనాటి అధికారులు అనాలోచితంగా ఆలోచించి పెట్రోల్‌బంక్ నిర్మాణానికి అనుమతులిచ్చారన్నారు. కావలి పట్టణ ట్రంకురోడ్డు ట్రాఫిక్ సమస్యతో తల్లడిల్లుతుంటే తహశీల్దారు కార్యాలయ ఆవరణంలోకూడా ట్రాఫిక్ సమస్యను తెచ్చిపెడుతారా.. అంటూ టిడిపినేతలు రెచ్చిపోయారు. ఇంత రద్దీగా ఉంటే ఈ కార్యాలయాల ఆవరణంలో పెట్రోల్‌బంక్ ఏర్పాటుచేయడంవల్ల ప్రజలకు తీవ్ర అసౌకర్యం కలుగుతుందన్నారు. ఈ ప్రాంతంలోని కార్యాలయాలకు ప్రజలు రాకపోకలు సాగించాలంటే చాలా ఇబ్బందిగా ఉంటుందన్నారు. పెట్రోల్‌బంక్ ఏర్పాటు నిర్ణయాన్ని విరమించుకోవాలని టిడిపినేతలు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షుడు గుత్తికొండ కిషోర్‌బాబు, ప్రధానకార్యదర్శి జ్యోతిబాబురావు, టిడిపి రాష్ట్ర కార్యదర్శి మాజీ ఏఎంసి ఛైర్మన్ మలిశెట్టి వెంకటేశ్వర్లు, మొగిలి కల్లయ్య, ఏరియా వైద్యశాల అడ్వైజరి కమిటి డైరక్టర్ చవల రామకృష్ణ, ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరక్టర్ తటవర్తి వాసు, టిడిపినేతలు దావులూరు దేవకుమార్, తదితరులు పాల్గొన్నారు. పెట్రోల్‌బంక్ నిర్మాణం జరిగితే ఒప్పుకునేదిలేదని టిడిపినేతలు ఖరాఖండీగా తేల్చిచెప్పారు.

## ఎమ్మెల్యేని సత్కరించిన పలువురు విశ్రాంత అధికారులు



**కావలి, జనవరి07 ప్రభాతవార్త :** కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డిని పలువురు అధికారులు, విశ్రాంత అధికారులు మంగళవారం కలిసి ఘనంగా సత్కరించారు. నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియచేశారు. ఈ కార్యక్రమంలో కావలి డివిజన్ సహాయ ఖజానాధికారి ఆర్ జగజీవన్, ఎస్పీఎస్ఆర్ నెల్లూరుజిల్లా విశ్రాంత ఉద్యోగుల సంఘం ఉపాధ్యక్షులు మొఘల్‌సిరాజ్‌బేగ్, విశ్రాంత వసతిగృహ సంక్షేమ అధికారి షేక్.ఖాదర్‌బాష, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు తెల్ల అశోక్‌కుమార్, ఉపాధ్యాయులు పి.సుధాకర్, తదితరులు కలిశారు. ఎమ్మెల్యే దగుమాటిని దుశ్శాలువాలతో సత్కరించి ఫ్రూట్స్ అందచేశారు.

## చదువుతోపాటు క్రీడలలో రాణించాలి... రాష్ట్రానికి మంచిపేరు తేవాలి
## జనసేన రాష్ట్ర ప్రచార కమిటి సభ్యుడు కెసిఏ అధ్యక్షుడు సిద్దు



**కావలి, జనవరి07 ప్రభాతవార్త :** చదువుతోపాటు క్రీడలలో కూడా రాణించి మన రాష్ట్రానికి, దేశానికి మంచి కీర్తిప్రతిష్టలు తీసుకురావాలని జనసేన రాష్ట్ర ప్రచారకమిటి సభ్యుడు, కావలి క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎంవి సిద్దు తెలిపారు. విక్రమ సింహపురి యూనివర్సిటి కావలిజోన్ క్రికెట్ ఫైనల్‌మ్యాచ్ స్థానిక విక్రమసింహపురి యూనివర్సిటి కళాశాలలో మంగళవారం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంవి సిద్దు ముఖ్యఅతిథిగా పాల్గొని క్రీడాకారులను పేరుపేరునా పలకరించి అభినందనలు తెలిపారు. ఈ ఫైనల్ మ్యాచ్‌లో కావలి జవహర్‌భారతి కళాశాల జట్టు, విక్రమ సింహపురి యూనివర్సిటి జట్టులు తలపడ్డాయి. 5 రన్స్ తేడాతో విక్రమ సింహపురి యూనివర్సిటి కళాశాల జట్టు విజయం సాధించింది. కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ టి.వీరారెడ్డి బహుమతి ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో టోర్నమెంట్ అబ్జర్వర్ డాక్టర్ పి.ప్రసాదరెడ్డి, ఆర్గనైజింగ్ కార్యదర్శి మణికంఠ, పి.డిలు శ్రీనివాసులు, తిరుపాలు, సీనియర్ క్రీడాకారులు రమణయ్య, భాస్కర్‌రావు, కొండలు, తిరుమల, తదితరులు పాల్గొన్నారు.

## 9న ఉదయగిరిలో బీజేపీ మైనార్టీ అధ్యక్షుడు పర్యటన



**ఉదయగిరి, జనవరి 7, ప్రభాతవార్త :** ఈనెల 9న గురువారం ఉదయగిరికి బీజేపీ రాష్ట్ర మైనార్టీ అధ్యక్షులు షేక్ బాజీ వస్తున్నట్లు ఉదయగిరి బీజేపీ నాయకులు ముడమాల రమేష్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయగిరిలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో ఉదయం 10 గంటలకు నియోజకవర్గ బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి బీజేపీ శ్రేణులు, అధిక సంఖ్యలో హాజరు కావాలని ఆయన కోరారు.

## బండగానిపల్లి పంచాయతీలో భూ సర్వే తప్పులు తడాకా



**ఉదయగిరి, జనవరి 7, ప్రభాతవార్త :** ఉదయగిరి మండల పరిధిలోని బండ గానిపల్లి పంచాయతీలో మంగళవారం భూముల రీ సర్వే తహశీల్దార్ ఎం. సుభద్ర నిర్వహించారు. ఈ సందర్భ ంగా సీపీఎం నాయకులు కాకు వెంకట య్య మాట్లాడుతూ భూముల రీ సర్వే లో తప్పుల తడాకగా ఉన్నాయని భూములు ఒకరి పేరు మీద ఒకరికి ఉన్నా యని ఇవి సరి చేయాలని తహశీల్దార్ సుభద్రకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## పిఆర్ఎస్ఐ ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా టైటస్ నిర్మల్ కుమార్



**నెల్లూరు రూరల్, జనవరి 7, ప్రభాతవార్త :** పబ్లిక్ రిలేషన్ సొసైటీ ఆఫ్ ఇండియా అమరావతి చాప్టర్ నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. ఇందులో నెల్లూరుకి చెందిన ప్రముఖ సంఘసంస్కర్త డాక్టర్ టైటస్ నిర్మల్ కుమార్ ఎగ్జిక్యూటివ్ నెంబర్‌గా ఎన్నుకున్నారు. ఏకగ్రీవంగా ఎన్నికైన కమిటీ ఆధ్వర్యంలో నూతన ఏడాదిలో విస్తృతంగా కార్యక్రమాలు చేపడుతున్నట్టు నిర్మల్ కుమార్ తెలిపారు. నూతన రాజధాని క్షేత్రంగా టిఆర్ఎస్ఐ చాప్టర్ ప్రారంభం నుండి నేటి వరకు ఎంతో పురోగతిని సాధించిందని తెలిపారు. రాబోయే రోజుల్లో మరెన్నో కార్యక్రమాలు చేపట్టి సంస్థను ఉన్నత శిఖరాలకు చేరుస్తామని తెలిపారు.

## ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా వైద్యాధికారి డాక్టర్ సుజాత



**పొదలకూరు, జనవరి 7, ప్రభాతవార్త :** జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ సుజాత మంగళవారం మహ్మదాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసారు. ఇక్కడ జరుగుతున్న ఆశా కార్యకర్తల నెలవారి సమీక్ష సమావేశంలో పాల్గొని ప్రజలకు ప్రజల ఆరోగ్యం పట్ల జాగ్రత్త వహించాలని ప్రతి శుక్రవారం ఫ్రైడే డ్రైడే కార్యక్రమం పాటించాలని తెలియజేసారు. ప్రజలు డెంగీ మలేరియాతో బాధపడకుండా చూసుకోవాల్సిన బాధ్యత ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బందిపై ఉన్నదని తెలియజేయడమైనది. గ్రామములో ఐదుగురుకు మించి జ్వరాలు ఉన్నాయని తెలిసిన వెంటనే వైద్య శిబిరం ఏర్పాటు చేసి ప్రజలకు తక్షణ వైద్య సేవలు అందించవలసిందిగా ఆదేశించారు. ప్రజలందరూ కూడాను ప్రతి శుక్రవారం ఫ్రైడే డ్రైడేగా ప్రతి శుక్రవారం ప్రజలందరూ ప్రతి ఇంటిలో వారం రోజులకు మించి నిల్వ ఉన్న నీటిని పారబోసి తాజా నీటిని నింపుకొని వాడుకోవలసినదిగా తెలిపారు. మహ్మదాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుండి తాటిపర్తి గ్రామం సందర్శించి జ్వర పీడితులను పరిశీలించి వారితో మాట్లాడారు. జ్వరాలు తగ్గేవరకు ఇక్కడ ప్రతిరోజూ ఫీవర్ సర్వే, లార్వా సర్వే నిర్వహించాలని, వైద్యశిబిరం కొనసాగించవలసినదిగా డాక్టర్ నరసింహ్ రావుని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మహమ్మదాపురం వైద్యాధికారులు డాక్టర్ నరసింహారావు, డాక్టర్ స్రవంతి, డాక్టర్ కిరణ్ రిషిత, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

## అర్హులైన ప్రతి ఓక్కరికి ఉపాధి పనులు కల్పించండి



**వరికుంటపాడు, జనవరి 7, ప్రభాతవార్త :** రాష్ట్రంలో అర్హులైన ప్రతి ఒక్కరికి ఉపాధి పనులు కల్పించాలని రాష్ట్ర పంచాయతీ రాజ్ కమిషనర్ కృష్ణ చైతన్య ఉపాధి హామి సిబ్బందికి దిశ నిర్దేశం చేశారు. మంగళవారం విడియో కాన్ఫిరెన్స్ లో ఉపాధి పనులపై కమీషనర్ సిబ్బందికి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. పని కల్పించి 300 రూపాయలు కూలీలకు వేతనం అందించేలా ఉపాధి సిబ్బంది కృషి చేయాలని సూచించారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామి చట్టము 2005 యొక్క ముఖ్య ఉద్దేశాలైన డిమాండ్‌కు అనుగుణంగా గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి కుటుంబానికి ఒక ఆర్థిక సంవత్సరంలో వంద రోజుల కంటే తక్కువ కాకుండ నైపుణ్యం అవసరం లేని వేతన ఉపాధిని అందించాలన్నారు. పేదల జీవనోపాధి వనరులను బలోపేతం చేయడం, పంచాయతీ రాజ్ సంస్థలను బలోపేతం చేయాలని ఉపాధి సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమములో ఎంపిడిఓ వేణుగోపాల్, ఎపిఓ అజంఖాన్, ఉపాధి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## బుచ్చిలో వేడుకగా 813వ గంధమహోత్సవం





**బుచ్చి జనవరి 7 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాళెం ఖాజనగర్‌లో వున్న ఆస్తానయో ఖాదరియా నుండి రకరకాల మేళతాళాలతో వేడుకగా సోమవారం గంధమ హోత్స వం నిర్వహించారు. రకరకాల పూలతో అలకంరించిన గుమ్మటంతో అత్యంత వైభవంగా ఖాజనగర్ ని " ఆస్తానియా ఖాదరియా " నుండి పురవీదులలో ఊరేగింపు నిర్వహించారు. ఖాజనగర్ నుండి బయలు దేరిన గంధమ హోత్స వం తిరిగి ఆస్తానయే చిష్తియాకు చేరుకుంది. పీఠాదిపతి ఖాజా అబుల్ ఇర్ఫాన్‌షా ముహ్మమ్మద్ అబ్దుల్ అజీజ్ నాయకత్వంలో అన్ని కార్యక్రమాలు నిర్వహించారు. ఈగంధమహోత్స వంలో అనేక మంది ఆద్యాత్మిక గురువులు ఇందులో పాల్గొన్న భక్తులందరికి సహపంక్తి బోజనాలు ఏర్పాటు చేశారు.

## వవ్వేరు బ్యాంకు త్రిసభ్య కమీటి చైర్మన్‌గా దొడ్ల విజయలక్ష్మీ



**బుచ్చి జనవరి 7 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాళెం నగర పాలక పంచాయితీలోని వవ్వేరు కో-ఆపరేటివ్ రూరల్ బ్యాంకు చైర్మన్‌గా దొడ్ల కోదండరామిరెడ్డి సతీ మణి మాజీ ఎంపిపి దొడ్ల విజయలక్ష్మీని కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఎంపిక చేశారు. అలాగే సభ్యులుగా కాగులుపాడుకు చెందిన మాల్యాద్రి,సాల్మాన్‌పురంకి చెందిన వెంకటేశ్వర్లురెడ్డి పేర్లు ఖరారు చేసినట్లు తెలిసింది. మరి కొద్ది రోజులలో ఆదేశాలు అందిన వెంటనే ప్రమాణస్వీకారం ఉంటుందని ఒనాయకుడు తెలిపారు.

## ఆదర్శ ఉద్యోగులుగా రాణిస్తున్న కావలి ఆర్‌టిసి డిపోమహిళలు




**కావలి, జనవరి7 ప్రభాతవార్త** కావలి ఆర్‌టిసి డిపోలో మహిళాకండక్టర్లు ఆదర్శ ఉద్యోగులుగా రాణిస్తున్నారని డిపో మేనేజర్ రాపూరు శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం ఆర్‌టిసి గ్యారేజ్‌లో ఉత్తమ ఉద్యోగుల అభినందనసభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. డిసెంబర్ నెలలో కావలి డిపో కండక్టర్లకు నిర్దేశించిన బస్సు ఆదాయపు లక్ష్యంలో 106 శాతం సాధించి కె.రమాదేవి ప్రధమస్థానం, 105 శాతం సాధించిన ఐ.సునీత రెండవ స్థానం, 104 శాతం సాధించిన కె.సుభాషిణి తృతీయస్థానంలో నిలిచారని ఆయన అభినందించారు. డిపో మేనేజర్ రాపూరు శ్రీనివాసులు వారికి నగదు బహుమతులు అందచేశారు. అసిస్టెంట్ మేనేజర్ (ట్రాఫిక్) కల్పన మాట్లాడుతూ పురుష కండక్టర్లతో పోటీపడి మహిళాకండక్టర్లు అత్యధిక బస్సు కలెక్షన్ సాధించడంపట్ల తానెంతో గర్వప డుతున్నానన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ సూపరిండెంట్ ఎం.రామకృష్ణ, సెక్యూరిటి అధికారి కెకె రావు, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ దాకారపు రవిప్రకాష్, ఉద్యోగసంఘ నాయకులు పాల్గొన్నారు.

## ప్రజలకు అసౌకర్యం కల్గించే పెట్రోల్‌బంక్ మాకు అక్కర్లేదు..!



**నెల్లూరు, జనవరి 7, ప్రభాతవార్త –కలెక్టరేట్** ప్రజలకు తీవ్ర అసౌకర్యం కల్గించే పెట్రోల్‌బంక్ అక్కర్లేదని, పెట్రోల్‌బంక్ నిర్మాణపు పనులను నిలిపివేసి, ఈ నిర్ణయాన్ని విరమించుకోవాలని టిడిపినేతలు కోరారు. మంగళవారం నెల్లూరులోని జిల్లా కలెక్టర్‌ను కావలి టిడిపినేతలు కలిసి వినతిపత్రం అందచేశారు. కావలి తహశీల్దారు కార్యాలయ ఆవరణంలో దాదాపు ఏడెనిమిది కార్యాలయాలు ఉన్నాయని జిల్లా కలెక్టర్‌కు తెలిపారు. ఈ కార్యలయాలకు నిత్యం రాకపోకలు సాగించేవారితో రద్దీగా ఉంటుందన్నారు. అందుచేత ఈ బంక్ నిర్మాణాన్ని నిలిపి వేయాలని తెలిపారు. వైసిపి పాలనలో నాటి అధికారులు అనాలోచితంగా ఆలోచించి పెట్రోల్‌బంక్ నిర్మాణానికి అనుమతులిచ్చారని ఇది ప్రజలకు ఎంతో అసౌకర్యమని తెలిపారు. కావలి పట్టణ ట్రంకురోడ్డు ట్రాఫిక్ సమస్యతో తల్లడిల్లి పోతుంటే, తహశీల్దారు కార్యాలయ ఆవరణంలో కూడా సమస్యలు సృష్టిస్తారా... అంటూ జిల్లా కలెక్టర్‌కు తెలిపారు. పెట్రోల్‌బంక్ నిర్మాణ నిర్ణయాన్ని విరమించాలని కోరారు. జిల్లా కలెక్టర్‌ను కలిసినవారిలో టిడిపి పట్టణ అధ్యక్షుడు గుత్తికొండ కిషోర్‌బాబు, ప్రధాన కార్యదర్శి జ్యోతిబాబురావు, టిడిపి రాష్ట్ర కార్యదర్శి మొగిలి కల్లయ్య, ఆర్యవైశ్య కార్పొరేషన్ రాష్ట్ర డైరక్టర్ తటవర్తి వాసు, దావులూరు దేవకుమార్, తదితరులు పాల్గొన్నారు.

## క్యాలెండర్‌ని ఆవిష్కరించిన డీఎంహెచ్‌ఓ



**నెల్లూరు, జనవరి 7, ప్రభాతవార్త – వైద్యం** నగరంలోని సంతపేటలో ఉన్న డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో డీఎంహెచ్‌ఓ ఛాంబర్‌లో మంగళవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ వంగల సుజాత, ఏపీ హంస జిల్లా క్యాలెండర్‌ని ఆవిష్కరించారు. అలాగే పీపీ యూనిట్ నెల్లూరులో మెడికల్ ఆఫీసర్, ఏవో డాక్టర్ వై.వెంకటేశ్వర్లు కూడా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఏపీ హంస జిల్లా ట్రెజరర్ మజూరుల్లా, జిల్లా ఉపాధ్యక్షులు కే.సహనా, వి.మురళీకృష్ణ, బి.నాగరాజమ్మ, జాయింట్ సెక్రటరీ టీవీ ఉషారాణి, నెల్లూరు రూరల్ యూనిట్ వైస్ ప్రెసిడెంట్స్ గౌస్‌భాషా, పృధ్వి, రమేష్, పలువురు ఏపీ హంస నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ డాక్టర్ సుజాత, ఏవో డాక్టర్ వై.వెంకటేశ్వర్లుకి ఏపీ హంస జిల్లా అధ్యక్షులు చేజర్ల సుధాకరరావు, జిల్లా సెక్రటరీ కమల్ కిరణ్ హృదపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు.

## ఘనంగా మాజీ ఎమ్మెల్యే మేకపాటి ముందస్తు జన్మదిన వేడుకలు



**ఆత్మకూరు, జనవరి7,ప్రభాతవార్త:** వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కుటుంబ సభ్యులు తనపై , తన కుటుంబంపై చూపుతున్న అభిమానం వెలకట్టలేనిదని అందరి సహకారంతో పార్టీని, నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని ఆత్మకూరు నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం నెల్లూరులోని మేకపాటి నివాసంలో ఆత్మకూరు మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి మందస్తు జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా నియోజకవర్గంలోని అన్ని మండలాల నుండి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజా ప్రతినిధులు భారీగా హాజరై ముందస్తు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన భారీ కేక్‌ను అందరితో కలిసి విక్రమ్‌రెడ్డి కట్‌చేసి అందరికి పంచిపెట్టారు.న మేకపాటికి ప్రతి ఒక్కరూ జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతూ శాలువాలతో సత్కరించి పూలబొకేలను అందజేశారు. ప్రజా సేవలో మరెంతో ఎత్తుకు ఎదగాలని ఆకాంక్షిస్తున్నామన్నారు. మాజీ ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి మాట్లాడుతూ ఆత్మకూరు, ఉదయగిరి నియోజకవర్గాల్లో తమ కుటుంబంపై ప్రజలు , వైసిపి నాయకులు చూరుతున్న అభిమానానికి ఎప్పుడూ రుణపడి ఉంటామన్నారు. ఆత్మకూరు నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి అనుకున్న అభివృద్ధ్ని సాధించేందుకు అందరి సహకారంతో ముందుకు సాగుతానన్నారు. రానున్న సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని అందరికి శుభాకాంక్షలు తెలిపారు. ఈకార్యక్రమంలో నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## నియోజకవర్గ స్థాయి టోర్నమెంట్ ప్రారంభం



**వింజమూరు,జనవరి7,ప్రభాతవార్త:** వింజమూరులోని మోటచింతలపాళెం సమీపంలో ఎంసిపిఎల్ క్రికెట్ టోర్నమెంట్ నియోజకవర్గ స్థాయి పోటీలను గణపం చంద్రారెడ్డి , పల్లాల ప్రసాద్‌రెడ్డి, రేవనూరు శ్రీనివాసులురెడ్డిలు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ ఎంసిపిఎల్ క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వాహకులు చౌదయ్య, శ్రీహరి, వారి స్నేహితులు ప్రతి ఏడాది సంక్రాంతి పర్వదినానికి ముందుగా ఈ టోర్నమెంట్స్‌ను నిర్వహిస్తూ క్రీడాకారుల్లో స్ఫూర్తిని నింపుతున్నారు. వింజమూరు పట్టణంలోని యువత ఉద్యోగ రీత్యా , వ్యాపార రీత్యా వివిధ ప్రాంతాలకు వెళ్ళి పండుగ ముందుగా స్వగ్రామానికి వచ్చి పండుగ వేడుకలను నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందన్నారు. ప్రతి ఏడాది ఎంసిపిఎల్ టోర్నమెంట్ నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేయడం ఆనందదాయకమన్నారు. క్రీడాకారులు క్రీడా స్ఫూర్తితో ఆటలు ఆడాలని వారు కోరారు. క్రికెట్ టీమ్ సభ్యులు పాల్గొన్నారు.

## మాలకొండలో మద్యం బెల్టుషాపు మామూళ్ల మత్తులో అధికారులు

**వలేటివారిపాలెం జనవరి 7, ప్రభాతవార్త** మద్యం అమ్మకాలకు కాదేదీ అనర్హత అన్నట్లుగా ఉంది. బడి గుడి ప్రదేశాలలో మద్యం అమ్మకాలు నిషిద్ధం. అయినప్పటికిని సుప్రసిద్ద శ్రీ మాల్యాద్రి లక్ష్మీనరసింహస్వామి దేవాలయసన్నిధి మాలకొండలో కొండ కింద బెల్టుషాపులు ద్వారా అక్రమంగా మద్యం అమ్మకాలు జోరు గా సాగుతున్నాయి. దీంతో భక్తులుతోపాటు స్ధానికులు అసౌకర్యానికి గురు వుతున్నారు.స్వామివారికి సమర్పించే పూజాసామాగ్రి దుకాణాల సముదాయం పక్కనే ఈ మద్యం షాపులు నిర్వహిస్తుండడం దారుణమని ప్రజలు వాపోతున్నారు.దీంతో భక్తుల మనోభావాలు దెబ్బ తింటున్నాయి.ప్రతి శుక్ర, శనివారాలలో మాలకొండలో వేలాది మంది భక్తులు స్వామివారి దర్శనార్ధం వ స్తుంటారు. ఇందులో మహిళాభక్తులు పిల్లలు అధికంగా ఉంటారు.వీరంతా శుక్ర వారం రాత్రికి మాలకొండకు వచ్చి మాలకొండ సత్రాలలో ఉంటుంటా రు. కొంతమంది ఆకతాయిలు సత్రాలలోనే మద్యం సేవిస్తున్న ్నట్లు ఆరోపణలు ఉన్నా యి.ఈ మద్యం షాపులు వలన సహచర భక్తులు ఇబ్బందిపడు తున్నా రు. మందుబాబులు మద్యం సేవించి మహిళాభక్తులతో అసహ్యంగా ప్రవర్తిస్తున్నా రన్న ఆరోపణలున్నాయి. అయినా అధికారులు పట్టించుకోవడం లేదు.పోలీస్ ,ఎక్సైజ్ అధికారులకు మామూళ్లు ముట్టచెప్పడంతో నిర్వహకులు ఈ వ్యాపారాన్ని సునాయసంగా కొసాగిస్తున్నట్లు స్ధానికులు ఆరోపిస్తున్నారు.

## వరివంగడాలు వేసిన కొద్దిరోజులకే ఎన్నులు వస్తున్నాయి



**కావలి, జనవరి7 ప్రభాతవార్త** కావలి ప్రాంతంలో ఎక్కు వభాగం వరివంగడాలు వేసిన అతికొద్దిరోజులకే ఎ న్నులు వస్తున్నాయని, రైతులు లబోదిబోమం టున్నారని వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘం నేతలు తెలిపారు. మంగళవారం కావలి ఆర్డీఓ కార్యాలయ సూప రింటెండెంట్‌ను కలిసి వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మికసంఘం రాష్ట్ర కమిటీసభ్యుదు తాళ్లూరు మాల్యాద్రి, మండల కార్యదర్శి ఎం.రాధాకృష్ణయ్య, గుమ్మడిబొందల గ్రామరైతు తుళ్లూరు వెంకట స్వామిలు మాట్లాడారు. వేసిన కొద్దిరోజులలోనే వరివంగడాలకు ఎన్నులు రావ డంవల్ల పంట దిగుబడి సక్రమంగా రాదన్నారు. అవగాహన కల్పించడంలో వ్యవ సాయశాఖ అధికారులు వైఫల్యం చెందారని విమర్శించారు. వరివంగడాలను పరిశీలించి రైతులకు పంట దిగుబడి బాగా వచ్చేవిధంగా వ్యవసాయశాఖ అధికా రులు అవగాహన కల్పించాలన్నారు. ఎరువులు, పురుగుమందులు ధరలను వ్యాపారస్తులు బాగాపెంచి అమ్మకాలు సాగిస్తున్నారన్నారు. ధరలు తగ్గించి నాణ్యమైన ఎరువులు, పురుగుమందులు రైతులకు అందచేసేలా చర్యలు చేపట్టా లన్నారు. రైతులకు మద్దతుధర కల్పించాలన్నారు.

## మధ్యాహ్న భోజన పథకంలో నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరి

### విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం



**కోవూరు, జనవరి 7 ప్రభాతవార్త :** ప్రభుత్వ పాఠశాలల్లో అందించే మధ్యాహ్న భోజనం అమ్మ చేతి వంటను తలపించేలా ఉండాలని , ఈ దిశగా ఏజెన్సీలు ప్రత్యేక దృష్టి పెట్టాలని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. కోవూరులోని తాళ్ల నారాయణశెట్టి జూనియర్ కళాశాలను ఆమె మంగళవారం భోజనం సమయంలో ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె కళాశాల విద్యార్థులకు అందించేందుకు సిద్ధంగా ఉన్న మధ్యాహ్న భోజనం నాణ్యతను, కూరలను స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె విద్యార్థులకు స్వయంగా భోజనం వడ్డించి అనంతరం విద్యార్థినులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భోజనంకు సంబంధించి కూరలు తయారు చేసే విషయంలో సుచి, శుభ్రత, నాణ్యత తప్పనిసరిగా పాటించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో, కళాశాలల్లో చదివే విద్యార్థులకు ప్రభుత్వం కోట్లాది రూపాయలు వెచ్చించి నిర్వహిస్తున్న ఈ పథకంలో నాణ్యత విషయంలో రాజీ పడితే సహించేది లేదన్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ప్రయోజనం చేకూరేలా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకం అమలు చేసిన విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కు ఈ సందర్భంగా ఆమె కృతజ్ఞతలు తెలియజేశారు. ముఖ్యంగా ప్రతి గ్రామంలో ఉన్న పాఠశాల, కళాశాలలను వారంలో కనీసం ఒకసారి అయినా స్థానిక ప్రజాప్రతినిధులు పరిశీలించి మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును పర్యవేక్షించాలన్నారు. ఈ సందర్భంగా ఆమె విద్యార్థులతో కలిసి భోజనం చేసి స్వయంగా విద్యార్థులో మాట్లాడి పలు విషయాలు తెలుసుకున్నారు. ఆమె జెట్టి బలరామిరెడ్డి ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి. శ్రీహరితో అసంపూర్తిగా ఉన్న భవన నిర్మాణాల గురించి ప్రశ్నించి తెలుసుకున్నారు. దీనికి సంబంధించి పూర్తి నివేదికను అందజేస్తే నిధుల మంజూరుకు తమవంతుగా కృషి చేస్తామని ఈ సందర్భంగా ఆమె పేర్కొన్నారు పెన్నా డెల్టా ఆయకట్టు చైర్మన్ జెట్టి రాజగోపాల్‌రెడ్డి,తహసీల్దార్ నిర్మలా నందబాబా, ఎంపీడీవో శ్రీహరి రెడ్డి, కోవూరు నీటి సంఘం అధ్యక్షుడు అత్తిపల్లి శివప్రసాద్‌రెడ్డిమస్తాన్, జనసేననాయకులు సీహెచ్‌శ్రీనివాసు లురెడ్డి ,,పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి. శ్రీ హరి కోవూరు సీఐ సుధాకర్‌రెడ్డి ఎస్సై రంగనాథ్‌గౌడ్ ఉన్నారు.



## ప్రకృతి వ్యవసాయ పద్దతులపై అవగాహన




**సైదాపురం, జనవరి 7, ప్రభాతవార్త** మండల పరిధిలోని ఊటుకూరు, తురిమెర్ల రైతు సేవా కేంద్రం పరిధిలో మండల వ్యవసాయశాఖాధికారిణి హైమావతి ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మంగళవారం గ్రామ సభలు నిర్వహించారు. ఈ గ్రామ సభలకు కేవీకే పెరియవరం ఉద్యానశాస్త్రవేత్త డి.తిరుపాలు, ఏడీఏ శ్రీనివాసులు, డీహెచ్‌ఓ సుబ్బారెడ్డి, మండల హార్టికల్చర్ అధికారి ఆనంద్ లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు రైతులు పండిస్తున్న నిమ్మ, మామిడి, వరి పైర్లను పరిశీలించారు. అనంతరం ప్రకృతి సేద్యంలో నిమ్మ, మామిడి వాటిలో పాటించాల్సిన ప్రకృతి వ్యవసాయ పద్దతులపై, మేలైన యాజమాన్య పద్దతుల గురించి రైతులకు వివరించారు. వ్యవసాయ శాఖ ఏడీఏ శ్రీనివాసులు వరిలో పాము పొడ తెగుళ్ల గురించి, వాటి నివారణ చర్యలపై రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

## హెచ్‌ఎంపివి చైనా వైరస్ గురించి బయపడవద్దు

### సంగంలో డాక్టర్లు శ్రీనివాసులురెడ్డి,అశోక్‌కుమార్



**సంగం జనవరి 7 ప్రభాతవార్త** సంగం పిహెచ్‌సిలో వైద్య సిబ్బందితో సమావేశం నిర్వహించిన డాక్టర్లు శ్రీనివాసులురెడ్డి, అశోక్‌కుమార్ హెచ్‌ఎంపివి చైనా వైరస్ పైన ఎవ్వరు ఆందోళన చెందవద్దని సూచించారు. కొన్ని సోషల్ మీడియాలో వచ్చే భయంకరమైన హెచ్చరికలు నమ్మవద్దని అన్నారు. చైనా వైరస్ సాధారణ వైరస్ మాత్రమే అని అన్నారు.కోవిడ్ సమయంలో తీసుకున్న జాగ్రత్తలు ( చేతులు శుభ్రం చేసుకోవడం, మాస్కులు ధరించడం) అటువంటి జాగ్రత్తలు తీసుకుంటే చాలు అని వారు తెలిపారు.ప్రజలు ధైర్యంగా ఉండాలని ఈ సమయంలో ఎక్కువగా ఆహార పదార్ధాలు వేడిగా తీసుకోవాలని,నీళ్ళుకూడా వేడిగా తాగాలని సూచించారు. ఈకార్యక్రమంలో వైద్యసిబ్బంది కూడా ఉన్నారు.

## కొనసాగుతున్న దేహదారుఢ్య పరీక్షలు



**నెల్లూరు క్రైమ్, జనవరి 7,ప్రభాతవార్త:** పోలీస్ కానిస్టేబుల్ అభ్యర్ధులకు గత వారం రోజులుగా స్థానిక పోలీస్ కవాతు మైదానంలో జరుగుతున్న దేహదారుఢ్య పరీక్షలు మంగళవారం కూడాకొనసాగాయి.ఏడవ రోజున జరిగిన కానిస్టేబుల్ దేహదారుఢ్య పరీక్షలకు 462 మంది అభ్యర్థులు హాజరు కాగా, వారిలో 387 మంది సర్టిఫికెట్ల పరిశీలన పూర్తయినట్లు రిక్రూట్మెంట్ వర్గాలు తెలిపాయి. దేహదారుఢ్య పరీక్షలు జరుగుతున్న విధానాన్ని జిల్లా ఎస్పీ జీ. కృష్ణ కాంత్ పరిశీలించారు.







ఫోటోలు : నంద మాల్యాద్రి

పచ్చని పంట పొలాలు.. మనస్సును ఆహ్లాదపరిచే పైరగాలి.. పంటపొలాల వద్ద జాలువారే భూగర్భ జలాలు పల్లెసీమల్ని పరిరక్షించే కోవెల అన్నీ ఒకే చిత్రంలో కనువిందు చేస్తున్న అద్భుత దృశ్యం.. మన ముదివర్తి గ్రామం

## జీజీహెచ్‌లో తనిఖీలు చేసిన డిప్యూటీ కలెక్టర్



**నెల్లూరు, జనవరి 7, ప్రభాతవార్త-వైద్యం** నగరంలోని దుర్గా మిట్టలో ఉన్న సర్వజన ప్రభుత్వ ఆసుపత్రిలో ఆ ఆసుపత్రి అడ్మినిస్ట్రేషన్ అధికారి, డిప్యూటీ కలెక్టర్ మహేశ్వరరెడ్డి మంగళవారం తనిఖీలు నిర్వహించారు. ఆసుపత్రిలో ఆక్సిజన్ ప్లాంటును తనిఖీ చేశారు. లిక్విడ్ ఆక్సిజన్‌ను బయట నుంచి కొనుగోలు చేస్తూ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన గాలి ద్వారా ఆక్సిజన్ తయారు చేసే ప్రాజెక్టును ఎందుకు మూలన పడేశారని అధికారులను ప్రశ్నించారు. మరమ్మత్తులు చేయించి రన్నింగ్‌లోకి తెస్తే లక్షలాది రూపాయలు పెట్టి లిక్విడ్ ఆక్సిజన్ కొనుగోలు చేయాల్సిన అవసరం ఉండదు కదా అనిప్రశ్నించారు. అలాగే ఆసుపత్రిలో బెడ్లు పరిశీలించారు. బాత్రూములు సరిపడా నీళ్లు వస్తున్నాయా లేదా పరిశీలించారు. క్లీనింగ్ గురించి ఆరా తీశారు. మాట్లాడుతూ ఆసుపత్రికి వచ్చే రోగులకు మౌలిక వసతులు కల్పించడమే ధ్యేయంగా పని చేస్తున్నామన్నారు. ఆయన వెంట ఏవో ఏడుకొండలు, ఫార్మాసిస్టు ఇన్‌చార్జ్ , సూపర్‌వైజర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఏపీ ఆర్ ఎస్ ఏ,ఏపీజేఏసీ డైరీ,క్యాలెండర్లు ,ఆవిష్కరించిన కలెక్టర్



**నెల్లూరు, జనవరి 7, ప్రభాతవార్త – కలెక్టరేట్** ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ మరియు ఏపీ జేఏసీ అమరావతి సంఘాల ఆధ్వర్యంలో ఈరోజు జిల్లా కలెక్టర్‌ని కలిసి జిల్లా అధికారుల సమక్షంలో రెవెన్యూ డైరీ ని, క్యాలెండర్లను విడుదల చేయడం జరిగింది. ఈ సందర్భంగా అసోసియేషన్ నాయకులు జిల్లా కలెక్టర్‌కి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియపరుస్తూ కేకును కట్ చేయడం జరిగింది. ఆ తదుపరి సంఘ నాయకులు జాయింట్ కలెక్టర్ కె కార్తీక్‌ని, జిల్లా రెవెన్యూ అధికారి ఉదయ భాస్కర్, కలెక్టరేట్ పరిపాలన అధికారి విజయ కుమార్ వారిని కలిసి శుభాకాంక్షలు తెలియపరిచారు.ఏపీ జెఎసి అమరావతి పక్షాన జిల్లా కార్యవర్గ సభ్యులు చైర్మన్ అల్లంపాటి పెంచలరెడ్డి, ఓ. ప్రసాద్, చిరంజీవి, చిన్నయ్య, శరత్ బాబు, సుబ్రమణ్యం, రాజేష్, వసంతకుమారి, రాధారాణి, రెవిన్యూ అసోసియేషన్ తరపున జిల్లా కార్యవర్గ సభ్యులు బి.మురళీ, డానియల్ పీటర్, జి.సతీష్, గోపి కృష్ణ,ప్రియాంక, లక్ష్మి, ఆనంద్, భాను ప్రకాష్,అశోక్, శేషయ్య, రాం మోహన్, అలరీష్, విజయ భాస్కర్, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

## పట్టణ ప్రణాళిక విభాగంకు రావాల్సిన బకాయిలు వసూళ్లు చేయండి






**నెల్లూరు కార్పొరేషన్,జనవరి 7,ప్రభాతవార్త:**నెల్లూరు నగరపాలక సంస్థ పట్టణ ప్రణాళిక విభాగం కు సంబంధించిన టౌన్ సర్వేయర్లు, మినిస్ట్రీయల్ సిబ్బంది, టౌన్ ప్లానింగ్ విభాగం సిబ్బందితో అదనపు కమిషనర్ నందన్ , సిటీ ప్లానర్ హిమబిందు ల సమీక్ష సమావేశాన్ని మంగళవారం కమాండ్ కంట్రోల్ సెంటర్ నందు నిర్వహించారు.

ఈ సమావేశంలో పాల్గొన్న నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ నందన్ మాట్లాడుతూ ఎల్.ఆర్.ఎస్, ఏ.పీ.డి.పి.ఎం.ఎస్, సర్క్యులేషన్ పాట్రన్స్, డిస్ప్లే డివైస్ ఫీస్ కు సంబంధించి బకాయిలు వెంటనే వసూలు చేయాలని లేని పక్షములో వాటిని తొలగించాలని ఎంక్రోచ్ మెంట్స్ రిమూవల్స్, ఫ్లెక్స్ రిమూవల్స్, యు.సి. నిబంధనలను, పబ్లిక్ గ్రీవెన్స్ వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ సిటీ ప్లానార్లు, ప్లానింగ్ కార్యదర్శులు సిబ్బంది పాల్గొన్నారు.